RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

హైదరాబాద్ 14 అక్టోబర్ 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:117






ప్రజాబలం

14 అక్టోబర్ 2026 బుధవారం

# లలిత కళా తోరణంలో నాలుగో రోజు నానబియ్యం బతుకమ్మ వేడుకలు:





హైదరాబాద్, అక్టోబర్ 13, 2026: తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకల్లో భాగంగా నాలుగో రోజు హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో ఉన్న లలిత కళా తోరణంలో "నానబియ్యం బతుకమ్మ" వేడుకలను నిర్వహించారు.ఈ వేడుకల్లో తెలంగాణ సమృద్ధమైన పుష్ప, సాంస్కృతిక వారసత్వం ప్రతిబింబించింది. మహిళలు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం భక్తి, ప్రకృతి ప్రేమ, సామాజిక ఐక్యత స్ఫూర్తిని ప్రతిబింబించింది.నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (చీ×ుఎవీ) మరియు నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు కూడా వేడుకల్లో పాల్గొని ఉత్సవ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు.

తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించి, ప్రోత్సహించడంతో పాటు, వాటిని రాష్ట్ర పర్యాటక అనుభవంలో అంతర్భాగంగా ప్రదర్శించేందుకు పర్యాటక శాఖ 2026 అక్టోబర్ 10 నుంచి 18 వరకు ఈ వేడుకలను నిర్వహిస్తోంది.

## రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు, 2027 ముప్పు

ప్రకృతి ప్రకోపించినప్పుడు ఏ ప్రభుత్వమైనా, ఎంతటి బలమైన వ్యవస్థ అయినా ఒక్కసారిగా కుదేలవుతుంది. అందులోనూ ఎల్ నినో వంటి వాతావరణ విపత్తులు పాలకులకు నిద్రలేకుండా చేసే అత్యంత క్లిష్టమైన సవాళ్లు. భూగోళం వేడెక్కడం వల్ల ఏర్పడే ఈ అనూహ్య వాతావరణ మార్పులు నేరుగా దేశ ఆర్థిక వ్యవస్థను, వ్యవసాయ రంగాలను ఛిన్నాభిన్నం చేస్తాయి. నీరు అనేది లేకపోతే మానవ జీవనమే మూగబోతుంది. తాగునీరు కరవైతే జనజీవనం అస్తవ్యస్తమవుతుంది, సాగునీరు అందకపోతే అన్నదాత కన్నీరుమున్నీరవుతాడు. ఇటు తాగు, సాగు నీటి కొరత ఏర్పడితే జల విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా పడిపోయి కరెంట్ కోతలు మొదలవుతాయి. తద్వారా పారిశ్రామిక ఉత్పాదకత దెబ్బతిని, నిత్యావసరాల ధరలు చుక్కలను తాకుతాయి. ఇదొక దుర్భిక్షపు విషవలయం.ప్రస్తుతం దేశాన్ని, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలను కమ్ముకువస్తున్న ముప్పు కేవలం సాధారణ ఎల్ నినో కాదు. అంతకంటే ఎన్నో రెట్లు భీకరమైన సూపర్ ఎల్ నినో . రుతుపవనాలు చేతులెత్తేయడంతో ఈసార వర్షపాతం అంతంతమాత్రంగానే నమోదైంది. జలాశయాలు సగం కూడా నిండని దుస్థితిలో, ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటిని వచ్చే ఏడాది జూన్ వరకు తీవ్రమైన పొదుపుతో, అత్యంత అప్రమత్తంగా వాడుకోవాల్సిన కత్తిమీద సాములాంటి పరిస్థితి ఏర్పడింది. జలాశయాల్లో నీటి మట్టాలు అడుగంటిపోతున్న ఈ తరుణంలో పాలకులకు ఇది మునుపెన్నడూ లేని విధంగా అగ్నిపరీక్షగా మారింది.ఈ కరవు పరిస్థితుల కారణంగా రాబోయే రోజుల్లో ప్రజల్లో తీవ్రమైన అసహనం, ఆగ్రహం వ్యక్తమవడం సహజం. తాగునీరు అందక, విద్యుత్ కోట్లు పెరిగి, పంటలు ఎండిపోతున్న సమయాల్లో సగటు జీవి అగ్గిమీద గుగ్గిలమౌతాడు. ఈ సహజమైన ప్రజా అసహనాన్ని, నిరాశను పాలకులపై తిరుగుబాటుగా మలచడానికి, రాజకీయ లబ్ధి పొందడానికి ప్రతిపక్షాలు ఎప్పుడూ కాచుకుని కూర్చుంటాయి. ప్రభుత్వంపై బురదజల్లేందుకు, ప్రజలను రెచ్చగొట్టేందుకు ఇదే అదనుగా భావిస్తాయి. అయితే, రాజకీయ ప్రత్యర్థుల విమర్శలను ఎదుర్కొంటూ కేవలం పోలీసు బలంతోనో, ప్రకటనలతోనో ఈ విపత్తును నియంత్రించడం ఏ ప్రభుత్వానికైనా సాధ్యం కాదు.మరి ఈ పెనుముప్పు నుంచి గట్టెక్కాలంటే ప్రభుత్వాలు చేయాల్సింది ఏమిటి? ముందుగా పారదర్శకతతో కూడిన వాస్తవాలను ప్రజల ముందుంచాలి. ఉన్న నీటి వనరులు, విద్యుత్ లభ్యతపై ప్రతి పౌరుడికి ముందస్తు అవగాహన కల్పించాలి. నీటిని, కరెంటును ఏ విధంగా పొదుపుగా వాడుకోవాలో వివరిస్తూ ఒక ప్రజా ఉద్యమంలాంటి ప్రచారాన్ని చేపట్టాలి. ఈ సూపర్ ఎల్ నినో విపత్తును కేవలం ప్రభుత్వ సమస్యగా కాకుండా, ఇది మనందరి ఉమ్మడి సంక్షోభం అనే భావనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. ప్రతి గృహం, ప్రతి రైతన్న, ప్రతి పారిశ్రామికవేత్త నీటి పొదుపులో భాగస్వామ్యులుగా మారేలా విప్లవాత్మకమైన మార్గదర్శకాలను అమలు చేయాలి.ప్రజలను ఈ విపత్తు నిర్వహణలో భాగస్వామ్యం చేసినప్పుడే ప్రభుత్వాలపై భారం తప్పుతుంది, కాస్త రిలీఫ్ దొరుకుతుంది.పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన శక్తివంతమైన ఎల్ నినో ప్రభావం, విపరీతంగా వేడెక్కుతున్న సముద్రాలు రాబోయే కాలంలో ప్రపంచ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయి. ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరికల ప్రకారం, ఈ సహజ వాతావరణ దృగ్విషయం డిసెంబర్‌లో శిఖరాగ్రానికి చేరుకుని 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం ఉంది. గ్రీన్‌హౌస్ ఉద్గారాల వల్ల పెరిగిన ఉష్ణోగ్రతలకు తోడు ఈ ఎల్ నినో ప్రభావం తోడవడంతో 2027 అత్యంత ఉష్ణోగ్రతలు నమోదయ్యే సంవత్సరంగా మారవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. మానవ కార్యకలాపాల వల్ల వాతావరణంలో పెరుగుతున్న గ్రీన్‌హౌస్ ఉద్గారాలు భూమిని నిరంతరం వేడెక్కిస్తున్నాయి. దీనికి తోడు ఎల్ నినో కారణంగా సముద్రాల నుండి విడుదలయ్యే అదనపు వేడి వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తుంది. ఈ రెండు పరిణామాలు కలిసికట్టుగా పనిచేయడం వల్ల, రాబోయే 2027 సంవత్సరం రికార్డు స్థాయిలో అత్యంత ఉష్ణోగ్రతలు నమోదయ్యే సంవత్సరంగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని ఉష్ణోగ్రతలలో వచ్చే మార్పుల వల్ల ఏర్పడే సహజ సిద్ధమైన వాతావరణ చక్రం. అయితే దీని ప్రభావం కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా టెలికనెక్షన్ ప్రభావం చూపుతుంది.ఆస్ట్రేలియా, ఇండోనేషియా, ఆసియా-పసిఫిక్ ప్రాంతాల్లో తీవ్రమైన వర్షాభావం, కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది. దక్షిణ అమెరికాలోని పశ్చిమ తీర ప్రాంతాలు పెరూ, ఈక్వెడార్ వంటి దేశాలు భారీ వర్షాలు, ఆకస్మిక వరదలను ఎదుర్కొనే అవకాశం ఉంది.వాతావరణంలో వచ్చే ఈ తీవ్రమైన మార్పులు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఆసియా, ఆస్ట్రేలియాలో వర్షపాతం తగ్గడం వల్ల గోధుమ, బియ్యం వంటి ప్రధాన పంటల దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంది. అలాగే సముద్ర ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల సముద్ర జీవగోళం, ముఖ్యంగా పగడపు దిబ్బలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. విపత్కర పరిస్థితులను దాటవేయడంలో పాలకుల ముందుచూపు, ప్రజల సహకారం రెండు చక్రాలలా పనిచేస్తాయి. కనీవినీ ఎరుగని ఈ నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం ఇప్పుడే కార్యాచరణ రూపొందించి, క్షేత్రస్థాయిలో కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి. లేదంటే, రాబోయే వేసవిలో ప్రజాగ్రహం తుఫానులా మారి ప్రభుత్వాల కొలువులను కూల్చడం తథ్యం. కాలం దాటిపోకముందే అప్రమత్తమై, ప్రతి చుక్క నీటిని భద్రపరిచే దిశగా యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభించడమే పాలకుల ముందున్న ఏకైక కర్తవ్యం.

# ఉచిత విద్యుత్ కు ఎసరు పెట్టే కుట్ర..
# రైతు డిస్కమ్ ఏర్పాటు జీవోపై హరీశ్‌రావు సీరియస్



ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సహా ఇతర రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, విద్యుత్ రంగ నిపుణులు, సామాజికవేత్తలు, రైతులు లేవనెత్తుతున్న అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ రైతు డిస్కమ్ ఏర్పాటు చేస్తూ జీవో17 జారీ చేయడాన్ని హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. రైతు డిస్కమ్ ఏర్పాటు జీవో జారీ కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, దుర్మార్గ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఉచిత విద్యుత్ సరఫరాకు పాతరేసి, రైతు మెడకు ఉరేసేందుకేనా ఈ కుట్ర అని ప్రశ్నించారు. వ్యవసాయానికి, గృహాలకు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు రైతు డిస్కమ్ పేరుతో మరో డ్రామాకు తెరతీయడం సిగ్గుచేటు అని హరీశ్‌రావు విమర్శించారు. రైతు డిస్కమ్ ఏర్పాటు వల్ల రైతులకు ఒరిగే ప్రయోజనం ఏమిటి? రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఈ నిర్ణయం ఎలా దోహదపడుతుందో చెప్పకుండా మొండిగా వ్యవహరించడం దుర్మార్గమని మండిపడ్డారు. సర్కార్ నిర్వాకంతో అన్నదాత మరింత ఇబ్బందుల్లో పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ట్రాన్స్ఫార్మర్స్ కాలిపోతే దిక్కు లేదు.. రేపు రైతు డిస్కం తో మరింత ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఉందని అన్నారు. రైతు మెడకు రైతు డిస్కం ఉచ్చు..ఉచిత విద్యుత్ పై చేతులెత్తేసేందుకే సర్కార్ కొత్త ఎత్తుగడ అని తెలిపారు. ?పంటలు ఎండి రైతు కన్నీరు పెడుతుంటే.. డిస్కంల పేరిట రేవంత్ సర్కార్ రాజకీయ చదరంగం ఆడుతున్నదని అన్నారు. జీవో ప్రకారం కొత్త డిస్కమ్ పరిధిలోకి 30,60,861 వ్యవసాయ కనెక్షన్లు, 512 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలు, ఊఓచిూాః, మిషన్ భగీరథ.. మొత్తంగా 30,62,853 కనెక్షన్లు రైతు డిస్కం కి బదిలీ చేశారని హరీశ్‌రావు తెలిపారు. ఇంత భారీ వ్యవస్థ నిర్వహణ కేవలం 2,000 మంది సిబ్బందితో ఎలా సాధ్యం అవుతుందని ఆయన ప్రశ్నించారు. కేవలం 25శాతం థర్మల్ పవర్ అలకేషన్ తో రైతులకు సాగు, ప్రజలకు తాగు నీళ్లకు అవసరం అయ్యే భారీ విద్యుత్ వ్యవస్థ ఎలా నడుస్తుందని నిలదీశారు. 6,15,651 వ్యవసాయ ట్రాన్స్ఫార్మర్లు, 2.51 లక్షల సర్క్యూట్ కిలోమీటర్ల వ్యవసాయ ఎల్‌టీ లైన్లు.. వీటి నిర్వహణకు సరిపడా సిబ్బంది లేకపోతే రైతుల కష్టాలకు ఎవరు బాధ్యత వహిస్తారని అడిగారు. రాష్ట్ర విద్యుత్ కేటాయింపుల్లో ఇప్పటికీ 53.28 శాతం థర్మల్ విద్యుత్తే ఉందని.. సౌర విద్యుత్తు వాటా 35.31 శాతం మాత్రమే అని హరీశ్‌రావు తెలిపారు. ఇందులో థర్మల్ 25%, సోలార్ 58%, హైడల్ మొత్తంగా 100% రైతు డిస్కమ్ కు కేటాయించారని అన్నారు. పగటి పూట మాత్రమే సోలార్ విద్యుత్ ఉత్పత్తి అయితే, రాత్రి పూట ఉండదని చెప్పారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పే ప్రభుత్వం.. పగటిపూట మాత్రమే విద్యుత్ ఇచ్చి, రాత్రివేళ రైతులను చీకట్లోకి నెట్టబోతోందా అని అనుమానం వ్యక్తం చేశారు. 2325 ఓచి హైడల్ (జల విద్యుత్) పవర్ మొత్తం రైతు డిస్కమ్‌కే కేటాయించారని హరీశ్‌రావు తెలిపారు. కానీ ఈ హైడల్ పవర్ సాంకేతికంగా ఏడాదిలో కేవలం 3-4 నెలలు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. అంటే మిగతా 8 నెలలు రైతు డిస్కమ్‌కి ఈ విద్యుత్ అందుబాటులో ఉండదు. అప్పుడు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. కొత్త డిస్కమ్‌కు భారీ రుణాలు, బకాయిలను కేటాయిస్తూ.. దాని ఆర్థిక స్థిరత్వంపై ప్రభుత్వం ఏం భరోసా ఇస్తోంది? ఈ అప్పుల భారం చివరకు రైతులపై పడేయాలని చూస్తున్నారా? రైతు డిస్కమ్ పేరుతో వ్యవసాయ విద్యుత్ బాధ్యతలను వేరుచేసి, రేపు నష్టాల సాకుతో రైతులపై ఆంక్షలు విధించే ప్రమాదం లేదా అని నిలదీశారు. రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగుతుందని, 24 గంటల సరఫరాలో ఎలాంటి కోతలు ఉండవని ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వగలదా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతుల అనుమానాలను నివృత్తి చేయకుండా ఏకపక్షంగా ముందుకు వెళ్లడం కుదరదని అన్నారు. కొత్త సంస్థ ఏర్పాటుతో అదనపు పరిపాలనా ఖర్చులు ఎంత? ఆ ఖర్చులను ఎవరు భరిస్తారు? ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల బదిలీపై పూర్తి వివరాలను ప్రభుత్వం బహిర్గతం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రైతుల పేరుతో డిస్కమ్ ఏర్పాటు చేయడం గొప్ప కాదు.. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం ముఖ్యం. సంస్థల పేర్లు మార్చడం, కొత్త సంస్థలు ఏర్పాటు చేయడం కాదు.. రైతుల విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు..రైతుల ప్రయోజనాలే లక్ష్యమైతే వారి అభ్యంతరాలను పక్కనపెట్టి ఎందుకు ముందుకెళ్తున్నారు? ఉద్యోగ సంఘాలు, విద్యుత్ రంగ నిపుణులు లేవనెత్తిన సందేహాలకు సమాధానం చెప్పకుండా చాటు మాటుగా జీవో జారీ చేయడం వెనుక ఉద్దేశం ఏమిటి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతులకు భరోసా ఇవ్వాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతుల్లో అనుమానాలు, ఆందోళనలు ఎందుకు పెంచుతోందని అన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాపై స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. రైతు డిస్కమ్ వల్ల కలిగే ప్రయోజనాలు, ఆర్థిక భారం, సిబ్బంది నిర్వహణపై పూర్తి వివరాలు వెల్లడించాలని సూచించారు. రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా ముందుకు వెళ్లకూడదని చెప్పారు. రైతు డిస్కమ్ ఏర్పాటు వెనుక రైతుల ప్రయోజనాలే లక్ష్యమైతే మా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.. లేదంటే తక్షణం జీవో ఉపసంహరించుకోవాలి అని యావత్ రైతాంగం పక్షాన డిమాండ్ చేశారు.

# చెన్నైకి తాగునీరు ఇవ్వండి: చంద్రబాబును కోరిన సీఎం విజయ్



తమ రాష్ట్ర రాజధాని చెన్నై నగరం ఎదుర్కొంటున్న తీవ్ర తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తెలుగు గంగ ద్వారా అదనపు జలాలను విడుదల చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన, మంగళవారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల అంశంపైనే చర్చలు జరిగాయి.

ముఖ్యమంత్రి విజయ్‌కు, ఆయన వెంట వచ్చిన అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో చెన్నై నగర తాగునీటి అవసరాలను తీర్చడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరింతగా సహకరించాలని సీఎం విజయ్ అభ్యర్థించారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో కృష్ణా నదిలో జలాల లభ్యత గణనీయంగా తగ్గి, ఏపీలోనే తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అయినప్పటికీ, పొరుగు రాష్ట్ర దాహార్తిని తీర్చాల్సిన బాధ్యత తమపై ఉందని ఆయన స్పష్టం చేశారు.

ఇప్పటికే ఒప్పందం ప్రకారం చెన్నై నగరానికి 4.08 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు చంద్రబాబు వివరించారు. భవిష్యత్తులో ప్రాజెక్టులలో నీటి లభ్యత, అవసరాలను బేరీజు వేసుకుని, మరికొంత నీటిని విడుదల చేసే అంశాన్ని కచ్చితంగా పరిశీలిస్తామని ఆయన విజయ్‌కు హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా కరవు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టు ఆవశ్యకతను చంద్రబాబు నొక్కి చెప్పారు. ఈ బృహత్తర పథకం రెండు రాష్ట్రాలకే కాకుండా దేశానికే మేలు చేస్తుందని ఆయన వివరించారు. ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో పలు ద్వైపాక్షిక అంశాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి.

RNI No.TELTEL/2005/16755
# ప్రజాబలం
PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక
Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 14 అక్టోంబర్ 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:117

# సింగరేణి కార్మికులకు, ఉద్యోగులకు దసరా కానుక..

**ఒక్కొక్కరికి రూ.1,53,912 లాభాల వాటా**
**38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు లబ్ధి.....**
**29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్**
**సింగరేణి కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం**
**పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల సమస్యలకు 15 రోజుల్లో పరిష్కారం**
**కార్మికుల సమస్యల పరిష్కారానికి మానవీయ దృక్పథం**
**సింగరేణి భవిష్యత్తు కోసం కొత్త బొగ్గు బ్లాక్‌లు..**
**ప్రజాభవన్‌లో మీడియాతో ప్రకటించిన భట్టి విక్రమార్క**
**సింగరేణిని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్..**
**ఇప్పుడు పోరుబాట హాస్యాస్పదం: మంత్రి శ్రీధర్‌బాబు**
**పదేళ్లు అధికారంలో ఉండి సమస్యలు పరిష్కరించని వారు ఇప్పుడు ఏం సాధిస్తారు**

సింగరేణి బొగ్గు గని కార్మికులకు దసరా పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు లాభాల వాటా కింద ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 చెల్లించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ?ప్రజాభవన్‌లో మంగళవారం మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో డిప్యూటి సిఎం మాట్లాడుతూ మొత్తం 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఈ నిర్ణయంతో ప్రయోజనం పొందనున్నారని, 29717 మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున దసరా బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా సింగరేణి లాభాల్లో 34 శాతాన్ని కార్మికులకు లాభాల వాటాగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ఏడాది సింగరేణి ఆర్జించిన 1754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం అంటే 596 కోట్ల రూపాయలను లాభాల వాటాగా కార్మికులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. గత ఏడాది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్ అందించామని, ఈ ఏడాది కూడా అదే మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించినట్లు వివరించారు.



మిగతా 5 లో

# ఓటములకు ఓటర్ల జాబితా కారణమా: రాహుల్ గాంధీపై అమిత్ షా ఫైర్

**సీఈసీ రాజీనామా డిమాండ్‌తో నిరసనలు చేస్తున్న రాహుల్‌పై అమిత్ షా విమర్శలు**
**గుజరాత్ స్థానిక ఎన్నికల ఓటమికి ఓటర్ల జాబితా సవరణ కారణమా అని ప్రశ్న**
**గాంధీనగర్‌లో 41 ఏళ్లుగా కాంగ్రెస్ గెలవలేదని గుర్తుచేసిన హోంమంత్రి**
**ప్రధాని మోదీకి ప్రజామద్దతుకు గుజరాత్ విజయమే నిదర్శనమని వ్యాఖ్య**
**ప్రతికూల రాజకీయాలు వీడి క్షేత్రస్థాయిలో పనిచేయాలని కాంగ్రెస్‌కు సూచన**

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుజరాత్‌లోని గాంధీనగర్ సహా ఇతర ప్రాంతాల్లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కారణమా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎస్ఐఆర్ ఇటీవల వచ్చిందేనని, కానీ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి ప్రవేశించినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ వరుస పరాజయాలను చవిచూస్తోందని, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇటువంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

మంగళవారం 'ఇండియా' కూటమి నేతలు, విద్యార్థి సంఘాలతో సమావేశమైన అనంతరం రాహుల్ గాంధీ మీడియా సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, సీఈసీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసమే తమ పోరాటమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

రాహుల్ మీడియా సమావేశం ముగిసిన వెంటనే స్పందించిన అమిత్ షా, గుజరాత్ ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. "గుజరాత్ ప్రజల మనోగతాన్ని ఈ ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయి. యావత్ దేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెనుక కొండలా నిలబడి ఉందన్న విషయాన్ని ఈ విజయం చాటిచెప్పింది. గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 44 స్థానాలకు గాను బీజేపీ 38 చోట్ల ఘన విజయం సాధించింది. గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీ ఓటు బ్యాంకు 10 శాతం పెరిగింది. రాహుల్ గాంధీకి నేను ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నాను. గాంధీనగర్‌లో గత 41 ఏళ్లుగా కాంగ్రెస్ ఒక్క ఎన్నికలోనూ విజయం సాధించలేదు" అని ఆయన గుర్తుచేశారు.

"రాహుల్ జీ, ఈ ఫలితాలకు కూడా ఓటర్ల జాబితా సవరణే కారణమని అంటారా? ప్రధాని మోదీకి, బీజేపీకి ఉన్న ప్రజాదరణను మీరు తోసిపుచ్చుతారా? మీరు తీవ్రంగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒకప్పుడు అధికారంలో ఉన్న కీలక ప్రాంతంలో 41 ఏళ్లుగా గెలవలేకపోవడంపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఇటీవల పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరిల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది" అని అమిత్ షా ఎత్తి చూపారు. ఢిల్లీలో వివిధ పార్టీల కార్యకర్తలను, జనాలను పోగేసినంత మాత్రాన దేశ ప్రజల నమ్మకాన్ని గెలుచుకోలేరని ఆయన హితవు పలికారు. "దేశ ప్రజల వాస్తవ గొంతుక పొలాల్లో, గ్రామాల్లో, మారుమూల కొండలు, అడవులు, నదీ తీరాల్లో ఉంది. మీకు అక్కడి ప్రజలతో సంబంధాలు తెగిపోయాయి. బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు వంటి అనేక రాష్ట్రాల్లో ప్రజలు దశాబ్దాలుగా కాంగ్రెస్‌ను తిరస్కరిస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా ప్రతికూల రాజకీయాలు మానుకుని ప్రజలతో మమేకం కావాలి" అని ఆయన సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల్లోనూ రాహుల్ గాంధీ, ఆయన మిత్రపక్షాలకు బీజేపీ-ఎన్డీయే కూటమి మరో భారీ ఓటమిని రుచి చూపిస్తుందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.



# ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. పలు అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రత్యేక చర్చ



వార్తా 4 లో

# చినిగిపోని.. తడిసినా చెడిపోని మీ సేవ సర్టిఫికెట్లు

**15 అత్యాధునిక భద్రతా ఫీచర్లతో కొత్త పేపర్**
**ఏళ్ల తరబడి భద్రంగా దాచుకునేలా ప్రత్యేక తయారీ**
**మీసేవలో జారీ చేసే సర్టిఫికెట్లకు ఇక లామినేషన్ పని లేదు**
**ప్రజాభవన్‌లో ప్రారంభించిన**
**ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

హైదరాబాద్, అక్టోబర్ 13: ప్రభుత్వ ధ్రువపత్రాల భద్రత, మన్నిక పెంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. చినిగిపోకుండా, నీళ్లు పడినా దెబ్బతినకుండా ప్రత్యేకంగా రూపొందించిన కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం ప్రారంభించారు.

హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లు రాజ్ ఠాకూర్, విజయ రమణారరావు, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ESD) కమిషనర్ టి. రవికిరణ్, అధికారులు, ప్రింటింగ్ ఏజెన్సీలు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

15 అత్యాధునిక భద్రతా ఫీచర్లు

కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌లో 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లను పొందుపరిచారు. నకిలీ సర్టిఫికెట్ల తయారీ, అనధికార నకళ్లను అరికట్టేలా వీటిని రూపొందించారు. భద్రతా కారణాలతో ఈ ఫీచర్ల పూర్తి వివరాలను వెల్లడించడం లేదు. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ పేపర్ సులభంగా చినిగిపోదు. నీళ్లు పడినా త్వరగా దెబ్బతినదు. సాధారణ వినియోగం, మడతపెట్టడం, ఎక్కువ కాలం భద్రపరచడం వల్ల కలిగే నష్టాన్ని తగ్గిస్తుంది. దీంతో సర్టిఫికెట్లను ఏళ్ల తరబడి మంచి స్థితిలో దాచుకునే అవకాశం ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో వాటికి లామినేషన్ చేయించాల్సిన అవసరం కూడా తగ్గుతుంది.



మిగతా 4 లో

## చిన్నశేష వాహనంపై ద్వారకా శ్రీకృష్ణుడి అలంకారంలో శ్రీ మలయప్పస్వామి దివ్యదర్శనం

వార్తా 7 లో

# ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన రక్షణ.. కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు!

**ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన రక్షణపై సుప్రీంకోర్టు నోటీసులు**
**కేంద్రం, ఎన్నికల సంఘం సమాధానాలు ఇవ్వాలని ఆదేశం**
**తదుపరి విచారణ నవంబర్ 2న జరిగే అవకాశం**
**2023 చట్టంలోని సెక్షన్ 16ను సవాల్ చేసిన ఏడీఆర్**
**రక్షణ వల్ల జవాబుదారీతనం తగ్గుతుందని ఏడీఆర్ వాదన**

ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు చట్టం ద్వారా కల్పించిన విస్తృత న్యాయపరమైన రక్షణను సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఈ రక్షణ రాజ్యాంగంలోని సమానత్వ హక్కు, భావప్రకటన స్వేచ్ఛకు సంబంధించిన నిబంధనలకు విరుద్ధమని 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) తన పిటిషన్‌లో పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై స్పందించింది. కేంద్రం, ఎన్నికల సంఘం తమ సమాధానాలను సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 2న చేపట్టే అవకాశం ఉంది.



మిగతా 4 లో

# ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి..

# పలు అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రత్యేక చర్చ

**రాష్ట్రాభివృద్ధికి ఊతమిచ్చే పలు మౌళిక వసతుల ప్రాజెక్టుల పట్ల కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూల స్పందన**

**తెలంగాణ అభివృద్ధికి కీలక ముందడుగు - మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**ఎల్బీనగర్--హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం**

**NH-65 హైదరాబాద్ - విజయవాడ - మచిలీపట్నం రహదారి విస్తరణ పనులు జనవరిలో ప్రారంభిస్తామని హామీ**

**కృష్ణా నదిపై సోమశిల వద్ద ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణ శంకుస్థాపనకు అంగీకారం**

**తెలంగాణకు ఐదు రోప్‌వేలు, మూడు ఆర్‌ఓబీలకు ఆమోదం**

**హైదరాబాద్--శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌పై కొత్త డీపీఆర్‌కు ఆదేశాలు**

**34 రహదారి పనులకు CRIF నిధుల కోసం కేంద్ర అధికారులకు ఆదేశాలు**

**హైదరాబాద్--అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనపై సానుకూల స్పందన**

**హైదరాబాద్ లో జరగనున్న IRC కి హాజరుకానున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ**





న్యూఢిల్లీ: తెలంగాణలో రహదారి ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడం, ప్రజలకు ప్రయాణ సమయాన్ని తగ్గించడం, మెరుగైన రహదారులు, గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాల వరకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రానికి అవసరమైన కీలక రహదారులు, వంతెనలు, ఎలివేటెడ్ కారిడార్లు, రోప్‌వేలు సహా పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

తెలంగాణలో రహదారి కనెక్టివిటీని మెరుగుపరిచి, ప్రజల ప్రయాణ కష్టాలను తగ్గించడంతో పాటు రాష్ట్ర ఆర్థిక, పర్యాటక అభివృద్ధికి దోహదపడే పలు ప్రతిపాదనలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించి, పలు ప్రాజెక్టులకు ఆమోదం తెలపడంతో పాటు సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు.

ఎల్బీనగర్--హయత్‌నగర్ ఎలివేటెడ్ కారిడార్ కు ఆమోదం,2027 జనవరిలో NH-65 విస్తరణ ప్రారంభం

హైదరాబాద్‌లో వేగంగా విస్తరిస్తున్న ప్రాంతాల్లో ఒకటైన ఎల్బీనగర్--హయత్‌నగర్ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది. ఈ మార్గంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సుమారు 54 కాలనీల్లో 10 లక్షల మందికి పైగా నివసిస్తున్నారని,ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు నిత్యం ప్రయాణించే ఈ మార్గంలో ట్రాఫిక్ తో పాటు, యాక్సిడెంట్ ఎక్కువగా జరుగుతున్నాయని మంత్రి కోమటి రెడ్డి, నితిన్ గడ్కరికి వివరించారు. ఈ మార్గంలో ప్రమాదాలు, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని తెలుపగా, కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి వార్షిక ప్లాన్ లో చేర్చి,ఎలివేటెడ్ కారిడార్ కు ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే వేలాది మంది ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గడంతో పాటు ప్రయాణ సమయం ఆదా కానుంది.

హైదరాబాద్ - విజయవాడ NH - 65 రహదారి పై నిత్యం జరుగుతున్న ప్రమాదాలపై పలు సందర్భాల్లో కేంద్ర మంత్రి గడ్కరీ దృష్టికి తీసుకెళ్లిన అంశాలను గుర్తు చేశారు. 17 బ్లాక్ స్పాట్స్ గుర్తించి ఫ్లై ఓవర్లు నిర్మాణం జరుగుతున్నా... ప్రస్తుతం ఉన్న 4 లేన్ రహదారిపై ట్రాఫిక్ లోడ్ విపరీతంగా పెరిగిందని, హైదరాబాద్--విజయవాడ--మచిలీపట్నం చీఎ-65 6ం2 లేన్ల విస్తరణ పనులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం జోడించి త్వరగా చేపట్టాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా, వాణిజ్య కార్యకలాపాలకు కీలకమైన హైదరాబాద్--విజయవాడ--మచిలీపట్నం చీఎ-65 విస్తరణ పనులకు నవంబర్ లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి 2027 జనవరిలో పనులు ప్రారంభిస్తామని కేంద్రమంత్రి హామి ఇచ్చారు. పెరుగుతున్న వాహన రద్దీకి అనుగుణంగా రహదారి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకుఈ ప్రాజెక్టు దోహదపడనుంది.

సోమశిల వద్ద కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం..ప్రయాణ దూరం,సమయం తగ్గుదల.. పర్యాటకానికి ఊతం

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రోడ్డు అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసేలా NH-167ఖపై కృష్ణా నదికి ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన కోసం మంత్రి చేసిన ప్రతిపాదనకు కేంద్ర మంత్రి అంగీకారం తెలిపారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతంలో సోమశిల నుంచి సంగమేశ్వర వరకు నిర్మించే ఈ బ్రిడ్జి ద్వారా తిరుపతి వెళ్లే వారికి సుమారు 80కి.మీ దూరం తగ్గి, దాదాపుగా 3 గంటల ప్రయాణ సమయం తగ్గుతుందని మంత్రి వివరించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన సోమశిల ఆలయం వద్ద పర్యాటక రంగం అభివృద్ధి చెంది తెలంగాణలో ఒక మైలురాయిగా నిలవనుందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తో కలిసి మంత్రి కోమటి రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు.

పర్యాటకం అభివృద్ధి చెందడంతో స్థానికంగా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడ నున్నాయనీ,ఆర్థిక కార్యకలాపాలకు కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయనీ తెలిపారు.

శ్రీశైలం మార్గంలో ఎలివేటెడ్ కారిడార్‌కు కొత్త డీపీఆర్

హైదరాబాద్--శ్రీశైలం NH-765పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన విజ్ఞప్తిపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొత్త DPR సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

పర్యాటక రంగానికి రోప్‌వేలతో కొత్త ఊతం

తెలంగాణలో పర్యాటక అభివృద్ధికి, ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు సులభంగా చేరుకునేందుకు పర్వతమాల పథకం కింద ఐదు రోప్‌వేల ఏర్పాటుకు కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారు. దీనివల్ల పర్యాటకులకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఆయా ప్రాంతాల్లో స్థానిక ఉపాధి, ఆర్థిక కార్యకలాపాలకు ప్రోత్సాహం లభించే అవకాశం ఉంది.

హైదరాబాద్--అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనపైనా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ ప్రాజెక్టు ముందుకు సాగితే రెండు రాష్ట్రల మధ్య రవాణా మరింత మెరుగుపడనుంది.

రైల్వే క్రాసింగ్‌ల వద్ద ఇబ్బందులకు పరిష్కారం

సేతు బంధన్ పథకం కింద తెలంగాణలో మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ROB) నిర్మాణానికి కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారు. రైల్వే గేట్ల వద్ద వాహనదారులు ఎదుర్కొనే నిరీక్షణను తగ్గించి, రహదారి భద్రతను మెరుగుపరచడానికి ఈ వంతెనలు దోహదపడనున్నాయి.

రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులను అభివృద్ధి చేయాలని, 34 రహదారి పనులకు CRIF నిధుల కొరకు విజ్ఞప్తి

రాష్ట్రంలో 34 రహదారి పనులకు సీఆర్ఐఎఫ్ (CRIF) నుంచి నిధులు మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కేంద్ర మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన నితిన్ గడ్కరీ సంబంధిత కేంద్ర అధికారులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అదేవిధంగా పుల్లూరు--అలంపూర్--జట్రపోలు--పెంట్లవెల్లి--కొల్లాపూర్--లింగాల--అచ్చంపేట--డిండి--దేవరకొండ--మల్లేపల్లి--నల్గొండ రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలన్న ప్రతిపాదనను మంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రతిపాదనపై కూడా నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు.

హైదరాబాద్‌లో IRC సమావేశాలకు గడ్కరీని ఆహ్వానించిన మంత్రి

నవంబర్ 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరగనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (IRC) కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై సానుకూలంగా స్పందించిన గడ్కరీ, కార్యక్రమానికి హాజరవుతానని తెలిపారు.

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలే లక్ష్యం

రహదారులు కేవలం ప్రయాణ సాధనాలు మాత్రమే కాకుండా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అభివృద్ధి మార్గాలని రాష్ట్ర ప్రభుత్వం నమ్ముతుందని మంత్రి కోమటి రెడ్డి పేర్కొన్నారు.

ఈ లక్ష్యంతోనే తెలంగాణకు అవసరమైన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రం సహకారం పొందేందుకు ముఖ్యమంత్రి నాయకత్వంలోనిరంతరంకృషి చేస్తున్నామన్నారు.ఢిల్లీలోజరిగినఈ సమావేశం రాష్ట్ర రహ దారి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు,ప్రజలకుమెరుగైన రవాణాసదుపాయాలుఅందించేందుకు కీలకంగా నిలవనుందని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, MoRTH అధికారులు,రాష్ట్ర అధికారులు ఉన్నారు.

## ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన రక్షణ..

## కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు!

**మొదటి పేజీ తరువాయి**

అసలు వివాదం ఏంటి?

2023లో తీసుకొచ్చిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టంలోని సెక్షన్ 16 ఈ వివాదానికి కేంద్రంగా ఉంది. ఈ నిబంధన ప్రకారం.. ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా లేదా ఎన్నికల కమిషనర్‌గా పనిచేసిన వ్యక్తి, తన అధికారిక విధుల నిర్వహణలో లేదా విధులు నిర్వహిస్తున్నట్లు భావించి చేసిన చర్యలు, మాట్లాడిన మాటలకు సంబంధించి ఆయనపై సివిల్, క్రిమినల్ కేసులను కోర్టులు స్వీకరించకూడదు. ఇప్పటికే కొనసాగుతున్న అలాంటి కేసులను కూడా కొనసాగించకూడదని ఈ సెక్షన్ పేర్కొంటోంది. ఈ రక్షణ విధుల్లో ఉన్నవారికే కాకుండా, గతంలో ఆ పదవుల్లో పనిచేసినవారికీ వర్తిస్తుంది. అయితే, ఈ నిబంధన రాజ్యాంగబద్ధతనే ఏడీఆర్ సవాలు చేసింది.

ఏడీఆర్ అభ్యంతరాలేంటి?

సెక్షన్ 16 రాజ్యాంగంలోని ఆర్టికల్ 14లోని సమానత్వ హక్కు, ఆర్టికల్ 19లోని స్వేచ్ఛకు సంబంధించిన హక్కులను ఉల్లంఘిస్తోందని ఏడీఆర్ వాదిస్తోంది. ఎన్నికల కమిషనర్లకు ఇంత విస్తృత రక్షణ కల్పించడం వల్ల వారి చర్యలపై జవాబుదారీతనం తగ్గుతుందని పిటిషన్‌లో పేర్కొంది. అధికార దుర్వినియోగం లేదా అవినీతికి సంబంధించిన ఆరోపణలపై న్యాయపరమైన పరిశీలనకు అడ్డంకులు ఏర్పడే అవకాశం ఉందని అభ్యంతరం వ్యక్తం చేసింది.

ఎన్నికల సంఘం అధికారాలపైనా మరో పిటిషన్

ఎన్నికల సంఘం పనితీరు, దాని అధికారాల వినియోగంపై కూడా సుప్రీంకోర్టులో వేర్వేరు పిటిషన్లు విచారణకు వస్తున్నాయి. ప్రస్తుత సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల సంఘానికి చెందిన అధికారాలను వ్యక్తిగతంగా వినియోగించగలరా లేదా ఆ సంస్థ తరపున ఏకపక్షంగా వ్యవహరించగలరా అనే అంశంపై దాఖలైన మరో పిటిషన్‌పై కూడా అక్టోబర్ 5న ధర్మాసనం కేంద్రానికి, ఎన్నికల సంఘానికి, ముగ్గురు ఎన్నికల కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల నిర్వహణపై పర్యవేక్షణ, ఆదేశాలు, నియంత్రణాధికారాలు ఎన్నికల సంఘం అనే సంస్థకు ఉంటాయని పిటిషనర్ వాదించారు. ఈ అధికారాలను సీఈసీ ఒక్కరే వినియోగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపైనా సుప్రీంకోర్టు స్పందన కోరింది.

సీఈసీ నియామక చట్టంపైనా భేదాభిప్రాయం

2023 చట్టంలో సీఈసీ, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపైనా సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది.

సెప్టెంబర్ 23న ఈ అంశంపై విచారణ జరిపిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ కేసును రాజ్యాంగ ధర్మాసనానికి పంపాల్సిన అవసరం లేదని అభిప్రాయపడగా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ మాత్రం ఇందులో రాజ్యాంగపరమైన కీలక ప్రశ్నలు ఉన్నాయని పేర్కొని విస్తృత ధర్మాసనానికి పంపాలని సూచించారు.

దీంతో ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించాలా వద్దా అనే విషయాన్ని పరిశీలించేందుకు కేసు పత్రాలను సీజేఐ సూర్యకాంత్ ముందుంచాలని ఇద్దరు న్యాయమూర్తులు ఆదేశించారు.

ప్రస్తుతం అమల్లో ఉన్న 2023 చట్టం ప్రకారం, నియామక కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ప్రధానమంత్రి నామినేట్ చేసే కేంద్ర మంత్రివర్గ సభ్యుడు ఉంటారు. అంతకుముందు, 2023 మార్చిలో అనూప్ బరణ్వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఏర్పాటులో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా కమిటీలో ఉండాలని పేర్కొంది.

ఎన్నికల కమిషనర్లకు కల్పించిన న్యాయపరమైన రక్షణ, వారి అధికారాల వినియోగం, నియామక విధానం వంటి అంశాలు ఇప్పుడు సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నాయి. ఈ పిటిషన్లపై వెలువడే తీర్పులు ఎన్నికల సంఘం స్వతంత్రత, జవాబుదారీతనానికి సంబంధించిన చర్చలో కీలకంగా మారనున్నాయి.

## చినిగిపోని.. తడిసినా చెడిపోని మీ సేవ సర్టిఫికెట్లు



**మొదటి పేజీ తరువాయి**

జీవితాంతం అవసరమయ్యే పత్రాలకు మరింత రక్షణ

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు విద్య, ఉద్యోగ, ఇతర అధికారిక అవసరాలకు ఉపయోగించే సర్టిఫికెట్లు ప్రజల జీవితంలో ఎంతో ముఖ్యమైనవని పేర్కొన్నారు. కొన్ని పత్రాలను జీవితాంతం భద్రంగా ఉంచుకోవాల్సి ఉంటుందన్నారు. అలాంటి ధ్రువపత్రాలు త్వరగా పాడవకుండా చూడటంతో పాటు వాటి విశ్వసనీయతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

ప్రజలకు అందించే ప్రభుత్వ సేవల్లో నాణ్యత, భద్రత, సౌలభ్యాన్ని మరింత పెంచే దిశగా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి వివరించారు. కొత్త సెక్యూరిటీ పేపర్‌తో సర్టిఫికెట్ల మన్నిక పెరగడంతో పాటు నకిలీలను అరికట్టేందుకు వీలవుతుందన్నారు. ప్రభుత్వ ధ్రువపత్రాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.

2011 నుంచి మీ సేవ సెక్యూరిటీ పేపర్

తెలంగాణలో మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక రకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. 2011 నుంచి మీ సేవ సర్టిఫికెట్ల ముద్రణకు ప్రత్యేక సెక్యూరిటీ పేపర్‌ను వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న పేపర్ స్థానంలో మరింత నాణ్యత, భద్రత, మన్నిక కలిగిన కొత్త పేపర్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యంగా జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు దీర్ఘకాలం భద్రపరచాల్సిన ఇతర ప్రభుత్వ పత్రాలకు ఇది ఎంతో ఉపయోగపడనుంది.

# సింగరేణి కార్మికులకు, ఉద్యోగులకు దసరా కానుక..





మొదటి పేజీ తరువాయి

సింగరేణి ఉద్యోగ, కార్మికులకు సొంతింటి కల సాకారం

'సింగరేణి ఉద్యోగులు, కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం. కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారికి న్యాయం చేస్తాం. సింగరేణి కార్మికులకు సొంత ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం. సింగరేణి సంస్థకు చెందిన భూముల్లో ఇప్పటి వరకు మైనింగ్ చేపట్టని ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఇళ్ల నిర్మాణానికి అనువైన లేఅవుట్లు సిద్ధం చేయాలి. మిశ్రమ ఆర్థిక విధానాలను ప్రోత్సహించి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహించిన భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరిట నెహ్రూ హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించాం. సింగరేణి నుంచి రెవెన్యూ శాఖకు తిరిగి అప్పగించిన 5,774 ఎకరాల భూముల్లో 4,500 ఎకరాలను గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు పట్టాల రూపంలో అందించారు. మిగిలిన సుమారు 1,250 ఎకరాలకు సంబంధించి జీవో నంబర్ 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని" సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించామని తెలిపారు. ?

?సింగరేణిలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఆర్డర్లు, ఇతర చట్టపరమైన ప్రక్రియలను రాబోయే 15 రోజుల్లో పూర్తి చేసి అర్హులైన అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేయాలని ఆదేశించినట్టు తెలిపారు. కార్మికుల పేర్ల మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 136 నుంచి గరిష్ఠంగా 170 మంది సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించామని, ఇందుకోసం ఏర్పాటు చేసిన సింగరేణి అధికారుల కమిటీ సిఫార్సుల ఆధారంగా తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెలా నిర్ణీత రోజున మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఆయా ఆసుపత్రుల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించి, వీలైనంత ఎక్కువ మంది కార్మికులకు ప్రయోజనం కలిగేలా మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాలతో విధులకు హాజరుకాక ఉద్యోగాలు కోల్పోయిన కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు వన్‌టైమ్ ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్మికుల కుటుంబాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని మానవీయంగా వ్యవహరించాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశ ్మని వివరించారు. సింగరేణి కార్మికులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి సేఫ్టీ కిట్స్ తప్పనిసరిగా పంపిణీ చేయాలని, కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావుండకూడదన్నారు. సింగరేణి ఉద్యోగులకు చెల్లిస్తున్న విధంగానే కార్మికుల పెర్క్స్ , అలవెన్స్ లపై ఆదాయపన్నును కూడా సంస్థ తరఫున ప్రభుత్వానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు వెల్లడించారు.?

?"సింగరేణి అధికారులు, జిల్లా కలెక్టర్‌తో కూడిన కమిటీ ఆక్రమిత నివాస ప్రాంతాల్లో నివసిస్తున్న వారి ప్రాథమిక జాబితాను సిద్ధం చేస్తుంది. స్థానిక ఎమ్మెల్యేలతో సంప్రదించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అర్హులైన లబ్ధిదారుల సమగ్ర జాబితాను రూపొందిస్తాం. ఈ ప్రక్రియను నెల రోజుల్లోపు పూర్తి చేయాలని ఆదేశించాం. సింగరేణి పరిధిలోని ఏరియా ఆసుపత్రులను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దుతాం. సామాన్య కార్మికుడు కూడా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి ఆసుపత్రుల్లోనే అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం. అవసరమైతే వైద్యుల వేతనాలు, పారితోషికాలను పెంచి నిపుణులైన వైద్యులను నియమిస్తాం. అత్యవసర వైద్యం కోసం కార్డియాక్, క్యాథ్ ల్యాబ్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని" వెల్లడించారు.

?బొగ్గు గనులు, ఓవర్‌బర్డెన్ డంప్‌ల దుమ్ము వల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతున్న అంశాన్ని దృష్టిలో ఉంచుకొని సింగరేణి పరిధిలోని పాత జిల్లాల్లో ప్రతి గ్రామానికి వెళ్లి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నరు. కార్మికులతోపాటు వారి కుటుంబాలు, స్థానిక ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. అధికారులకు పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్పీ)ను చెల్లించేలా యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచాలని, ఖరీదైన పట్టణ, వాణిజ్య భూములను సోలార్ ప్లాంట్లకు వినియోగించకుండా, పట్టణాలకు వెలుపల ఉన్న నిరుపయోగ భూములు, ఓవర్‌బర్డెన్ గుట్టలను ఇందుకు ఉపయోగించుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలతోపాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించాం. వాటి నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు సింగరేణి నుంచి స్థలం కేటాయించే అంశాన్ని పరిశీలించాలని, ఇందుకు బదులుగా రెవెన్యూ భూముల్లోని నిరుపయోగ గుట్టల భూములకు సంబంధించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలులో భాగంగా ?రామగుండంలో సింగరేణి ఆధ్వర్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. సత్తుపల్లి, భూపాలపల్లి నియోజకవర్గాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తామన్నారు.

?సింగరేణి సంస్థను అభివృద్ధి చేయడంతోపాటు కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రత, ఆరోగ్యం, గృహవసతి వంటి అంశాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతాం అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

సింగరేణి లాభాలు తగ్గడానికి కారణాలివే

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సింగరేణి లాభాలు తగ్గడానికి పలు కారణాలున్నాయని ఉప ముఖ్యమంత్రి వివరించారు. ముఖ్యంగా గత పదేళ్లలో కొత్త బొగ్గు బ్లాక్‌లను అదనంగా సాధించడంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన బొగ్గు బ్లాక్‌ల వేలంలో సింగరేణి పాల్గొనకుండా చేయడం వల్ల సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆరోపించారు. సుమారు 141 బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియలో సింగరేణి పాల్గొనే అవకాశాన్ని వినియోగించుకోలేదని, దీంతో సంస్థ వ్యాపార విస్తరణకు ఆటంకం ఏర్పడిందని పేర్కొన్నారు. మరోవైపు ఇప్పటికే ఉన్న బొగ్గు బ్లాక్‌లలో కొన్ని మూతపడుతుండటంతో ఉత్పత్తి, ఆదాయంపై ప్రభావం పడుతోందన్నారు. దాదాపు 14 బ్లాక్‌లు మూతపడిన నేపథ్యంలో వాటి స్థానంలో కొత్త బ్లాక్‌లను సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

కొత్త బ్లాక్‌ల సాధనకు ప్రజా ప్రభుత్వం చర్యలు

సింగరేణి సంస్థను బలోపేతం చేసేందుకు తమ ప్రభుత్వం కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనపై దృష్టి సారించిందని భట్టి విక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వం దిగిపోయిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కొత్త బ్లాక్‌లను సాధించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. తాడిచెర్ల-2, కోయగూడెం బ్లాక్ -3, మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్, నైని వంటి బ్లాక్‌లను ప్రస్తావిస్తూ, కొత్త బ్లాక్‌ల సాధనతో పాటు సంస్థ వ్యాపారాన్ని విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.ఏ మైనింగ్ సంస్థ అయినా నిరంతరం కొత్త బ్లాక్‌లను సాధిస్తూ వ్యాపారాన్ని విస్తరించుకుంటేనే దాని ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల భవిష్యత్తు, సంస్థ మనుగడ, బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం పెంపు దృష్ట్యా ఈ చర్యలు అత్యంత కీలకమని స్పష్టం చేశారు.?

మార్కెట్‌కు అనుగుణంగా బొగ్గు ధరల సర్దుబాటు

?ప్రస్తుతం బొగ్గు మార్కెట్‌లో తీవ్రమైన పోటీ నెలకొందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. మహానది, కోల్ ఇండియా, వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ వంటి సంస్థల నుంచి బొగ్గు సరఫరా అవుతోందని, ప్రైవేటు సంస్థలు కూడా తక్కువ ధరలకు బొగ్గును అందిస్తున్నాయని వివరించారు. సింగరేణి బొగ్గు ధరలు అధికంగా ఉండటంతో కొన్ని సంస్థలు ఇతర వనరుల నుంచి బొగ్గు కొనుగోలు చేసేందుకు మొగ్గుచూపుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మార్కెట్ ధరలకు అనుగుణంగా సింగరేణి బొగ్గు ధరలను హేతుబద్ధీకరించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ధరలను సర్దుబాటు చేయకపోతే బొగ్గు కొనుగోలుదారులను కోల్పోయే ప్రమాదం ఉందని, తద్వారా సంస్థ ఆదాయం మరింత తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సింగరేణి ఆర్థిక ప్రయోజనాలను కాపాడుతూనే మార్కెట్‌లో పోటీతత్వాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు.

విద్యుత్ సంస్థల బకాయిలపై స్పందన

సింగరేణికి విద్యుత్ సంస్థల నుంచి రావాల్సిన బకాయిల అంశాన్ని కూడా భట్టి విక్రమార్క ప్రస్తావించారు. గత పదేళ్లలో సుమారు రూ.29 వేల కోట్ల బకాయిలు పేరుకుపోగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్లలో సుమారు రూ.27 వేల కోట్ల బకాయిలు ఉన్నట్లు వివరించారు. జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన మొత్తాలను క్రమంగా చెల్లించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను ఒక్కసారిగా చెల్లించడం సాధ్యం కాకపోయినా, వాటిని దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. బకాయిలు ఎప్పుడు పేరుకుపోయినా, వాటిని చెల్లించాల్సిన బాధ్యత సంబంధిత సంస్థలపై ఉంటుందని స్పష్టం చేశారు.

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సింగరేణి కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడంతోపాటు సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధన, మార్కెట్‌కు అనుగుణంగా ధరల సర్దుబాటు, బకాయిల వసూలు వంటి అంశాలపై సమగ్రంగా దృష్టి సారిస్తున్నామని తెలిపారు. సింగరేణి ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించి సంస్థను మరింత పటిష్ఠంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. దసరా సందర్భంగా కార్మికులకు లాభాల వాటా, కాంట్రాక్టు కార్మికులకు బోనస్ ప్రకటించడం వారి సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.

సింగరేణిని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్.. ఇప్పుడు పోరుబాట హాస్యాస్పదం: మంత్రి శ్రీధర్‌బాబు?

పదేళ్లు అధికారంలో ఉండి సమస్యలు పరిష్కరించని వారు ఇప్పుడు ఏం సాధిస్తారు

సింగరేణి సంస్థను పదేళ్ల పాటు అధికారంలో ఉండి నిర్వీర్యం చేసి, భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు పోరుబాట పేరుతో ఆందోళనలకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎద్దేవా చేశారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి పరిష్కరించలేని సమస్యలను ప్రతిపక్షంలో ఉండి ఎలా పరిష్కరిస్తారో మాజీ మంత్రి హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి సంస్థకు చేసిన మేలేమిటో, కార్మికుల సమస్యలను ఎందుకు పరిష్కరించలేకపోయిందో ముందుగా పోరుబాటలో వివరించాలని శ్రీధర్‌బాబు సూచించారు. కార్మికుల సమస్యలపై ఇప్పుడు ఆందోళనలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు.. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు స్పందించలేదో ప్రజలకు చెప్పాలని అన్నారు. మారుపేర్ల సమస్యను పదేళ్ల పాలనలో ఎందుకు పరిష్కరించలేకపోయారని ప్రశ్నించారు.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

సింగరేణి సంస్థను కాపాడటంతోపాటు కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని మంత్రి తెలిపారు. కార్మికుల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. మారుపేర్ల సమస్య పరిష్కారానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీసుకున్న సానుకూల నిర్ణయాన్ని తాను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. సింగరేణిలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. డిస్మిస్డ్ ఉద్యోగుల సమస్యలతోపాటు కార్మికులకు సంబంధించిన పలు సంక్షేమ అంశాలపై నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. శాశ్వత ఉద్యోగులతోపాటు కాంట్రాక్టు కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ?సింగరేణి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతో పాటు పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ విద్యాసంస్థలను ఆధునికీకరిం చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని శ్రీధర్‌బాబు చెప్పారు. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులకు అవసరమైన శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపర చాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను స్వాగతించాల్సింది పోయి, వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులకు హితవు పలికారు. సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు ప్రేం సాగర్ రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కోరం కనకయ్య, మట్టా రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, మాలోతు రాందాస్ నాయక్, గండ్ర సత్యనారాయణ రావు, విజయరామారావు, ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, లాభాల వాటాను ప్రకటించడం పట్ల ఎమ్మెల్యేలు డిప్యటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబులను శాలువా కప్పి సత్కరించారు.

## నేడు 1/2005 ఆక్ట్ రద్దు కోరుతూ భాష పండితుల రాష్ట్ర సదస్సు

హైదరాబాద్ : అక్టోబర్ 14 బుధవారం నాడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 1/2005 ఆక్ట్ రద్దు కోరుతూ తెలంగాణ రాష్ట్ర సదస్సును బాగ్ లింగం పల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు 1/2005 ఆక్ట్ బాధిత సంఘం నాయకులు డాక్టర్.ఎస్.విజయ భాస్కర్ నేడొక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రం లోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలలలో ఉన్నత పాఠశాలలలో పనిచేస్తూ ప్రాథమిక పాఠశాల జీతాలు తీసుకొని వెట్టిచాకిరి,శ్రమ దోపిడికి గురైనట్లు ఆయన పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 1/2005 ఆక్ట్ రద్దు చేసి ఆర్థిక ప్రయోజనాలు లేకపోయిన స్కూల్ అసిస్టెంట్ సర్వీస్ ఇవ్వాలని విజయ భాస్కర్ కోరారు.మనదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు పనికి తగిన వేతనం ఇవ్వాలని ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించిందని విజయ భాస్కర్ తెలిపారు.

## రాజకీయాల కన్నా ప్రజా సంతృప్తి కీలకం

హైదరాబాద్ అక్టోబరు 13 తెలంగాణ రాజకీయ తెరపై ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వేస్తున్న ఎత్తులు, పైఎత్తులు ప్రత్యర్థులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. రాజకీయ వ్యూహాల్లోనూ, మైండ్ గేమ్‌లోనూ తనదైన దూకుడు ప్రదర్శిస్తున్న రేవంత్.. పాలన విషయానికి వచ్చేసరికి మాత్రం అదే స్థాయిలో సక్సెస్ కాలేకపోతున్నారనే విమర్శలు క్షేత్రస్థాయి నుంచి గట్టిగా వినపడుతున్నాయి. ప్రభుత్వ మార్పుతో సరికొత్త సంచలనాలు వస్తాయని ఆశించిన సామాన్య ప్రజలు.. కనీసం గతంలో అందిన సంక్షేమ పథకాలైనా సక్రమంగా అందుతాయా లేదా అనే సందేహంలో పడిపోయారు.గత బీఆర్ఎస్ హయాంలో అమలులో ఉండి, ప్రజల దైనందిన జీవితంలో భాగమైన కొన్ని పథకాలు రేవంత్ రెడ్డి పాలనలో మందగించడం, అసలు అమలు కాకపోవడం ప్రధాన విమర్శలకు దారితీస్తోంది. కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలు అమల్లో సాంకేతిక, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న సమయంలో, పాత పథకాల పంపిణీలో సైతం ఆలస్యం జరగడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. ముఖ్యంగా రైతు సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి నిబంధనలు లేకుండా లభించిన రైతు బీమా పథకాలు.. కాంగ్రెస్ తెచ్చిన రైతు భరోసా పేరు మార్పుతో పాటు ఆంక్షలు పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. సాగులో లేని భూములు, గుట్టలకు పెట్టుబడి సాయం కట్ చేస్తామని ప్రకటించినప్పటికీ, అసలైన రైతులకు వానాకాలం, యాసంగి పెట్టుబడి సహాయం అందించడంలో విపరీతమైన ఆలస్యం జరుగుతోందని ప్రతిపక్షాలు , రైతు సంఘాలు మండిపడుతున్నాయి.పేద కుటుంబాల్లో పెళ్లిళ్లకు కొండంత అండగా నిలిచే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్' పథకాల పరిస్థితి కూడా దయనీయంగా మారింది. దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు చెక్కులు అందడం లేదని, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది అప్లికేషన్లు పెండింగ్‌లో పడిపోయాయని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం తులం బంగారం ఇస్తామని ఎన్నికల వేళ హామీ ఇచ్చినప్పటికీ, పాత ఆర్థిక సహాయం రూ. 1,00,116 అందించడంలోనే నత్తనడక నడవడం ఆర్థిక లోటును తేటతెల్లం చేస్తోంది. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర ఆర్థిక లోటు, భారీ రుణభారం కారణంగానే సంక్షేమ పథకాలకు సకాలంలో నిధులు విడుదల చేయలేకపోతున్నామని పాలకపక్షం సమర్థించుకుంటున్నప్పటికీ.. ప్రజలకు మాత్రం లబ్ధి వేగంగా అందడం లేదనేది వాస్తవం. బీఆర్ఎస్ హయాంలో లోపాలున్నప్పటికీ పథకాలు నిరంతరాయంగా అందేవని, కానీ ఇప్పుడు నిధుల కొరత సాకుగా చూపి ఆలస్యం చేస్తున్నారనే భావన పల్లెల్లో వ్యక్తమవుతోంది. రాజకీయంగా ప్రత్యర్థులను కార్నర్ చేయడంలోనూ, పట్టు నిలుపుకోవడంలోనూ నిరంతరం బిజీగా ఉంటున్న రేవంత్ రెడ్డి.. గ్రౌండ్ లెవెల్ అడ్మినిస్ట్రేషన్‌పై అదేస్థాయి దృష్టి పెట్టలేకపోతున్నారనేది ఎక్కువ మంది అభిప్రాయం. ప్రతిపక్షాలపై విమర్శలతో సమయం గడపడం కంటే, ప్రజలకు నిత్యావసరాలుగా మారిన సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అందిస్తేనే ప్రభుత్వానికి నిజమైన దూకుడు ఇమేజ్ లభిస్తుందని అంటున్నారు.

# ఫార్ములా-ఈ కేసులో కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్

హైదరాబాద్ , అక్టోబరు 13 బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫార్ములా–ఈ రేస్ నిధుల మళ్లింపు వ్యవహారంలో చట్టపరమైన ఉచ్చు బిగుసుకుంటున్న వేళ.. ఆయన సరికొత్త న్యాయపోరాటానికి తెరలేపారు. ఏసీబీ నమోదు చేసిన చార్జ్‌షీట్ నుంచి తన పేరును పూర్తిగా తొలగించాలని కోరుతూ హైదరాబాద్ నాంపల్లిలోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. రూ. 55 కోట్ల హెచ్ఎండీఏ నిధులను విదేశీ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారన్న అభియోగాలపై దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను కొట్టివేయాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. న్యాయస్థానం ఈ పిటిషన్‌పై విచారణను నవంబర్‌కు వాయిదా వేసింది.అయితే, ఇప్పటికే ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలంటూ హైకోర్టుతో పాటు దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వరకు వెళ్లి చుక్కెదురు చూసిన తర్వాత.. మళ్లీ నాంపల్లి కోర్టులో డిశ్చార్జ్ పిటిషన్ వేయడం ఎంతవరకు చెల్లుబాటు అవుతుందనే చర్చ మొదలైంది. భారత న్యాయవ్యవస్థలో ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని వేసే క్వాష్ పిటిషన్ పరిధి వేరు.. చార్జ్‌షీట్ దాఖలయ్యాక వేసే డిశ్చార్జ్ పిటిష పూర్తిగా వేరు. గతంలో కేటీఆర్ సుప్రీంకోర్టు వరకు వెళ్ళింది కేవలం ఏసీబీ నమోదు చేసిన ప్రాథమిక ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలన్న అభ్యర్థనతో మాత్రమే.అప్పట్లో దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని, నేరం జరిగిందా లేదా అన్నది తేలడానికి దర్యాప్తును ఆపలేమని స్పష్టం చేస్తూ హైకోర్టు, సుప్రీంకోర్టులు ఆ క్వాష్ పిటిషన్లను కొట్టివేశాయి. అయితే, ఇప్పుడు ఏసీబీ తన సమగ్ర విచారణను పూర్తి చేసి తుది చార్జ్‌షీట్‌ను కోర్టు ముందుంచినందున, చట్టపరంగా నిందితుడికి ట్రయల్ ప్రారంభం కాకముందే డిశ్చార్జ్ పిటిషన్ వేసే సంపూర్ణ హక్కు ఉంటుందని లీగల్ ఎక్స్‌పర్ట్స్ స్పష్టం చేస్తున్నారు.డిశ్చార్జ్ పిటిషన్‌లో కేటీఆర్ లేవనెత్తే ప్రధాన వాదనలు సాంకేతిక, విధానపరమైన అంశాల చుట్టూ తిరగనున్నాయి. ఫార్ములా–ఈ రేస్ నిర్వహణ అనేది రాష్ట్ర ప్రతిష్టను పెంచేందుకు తీసుకున్న ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమే తప్ప, అందులో వ్యక్తిగత అవినీతి లేదా క్విడ్ ప్రో కో లేదని ఆయన న్యాయవాదులు వాదించనున్నారు. ప్రాథమిక ఆధారాలు లేవని, అలాంటప్పుడు తనను విచారణకు పంపడం నిరర్థకమని కేటీఆర్ వాదించవచ్చు. న్యాయస్థానం నిందితులపై అభియోగాలు నమోదు చేయడానికి ముందే.. ఈ పత్రాల ఆధారంగా తనను కేసు నుంచి విముక్తి చేయాలని కోరడం ఒక వ్యూహాత్మక అస్త్రం. కేటీఆర్‌కు ఊరట లభించడం అంత సులభం కాకపోవచ్చు. డిశ్చార్జ్ పిటిషన్ దశలో న్యాయస్థానం సాక్ష్యాధారాల లోతుల్లోకి వెళ్లి వాటి బలాబలాలను నిర్ణయించదు. ప్రాథమికంగా అనుమానం లేదా ఆధారాలు ఉంటే కేసును ట్రయల్‌కు పంపించడానికే మొగ్గు చూపుతుంది. గవర్నర్ ప్రాసిక్యూషన్ అనుమతి ఇవ్వడం, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులు చార్జ్‌షీట్‌లో ఉండటం ఏసీబీకి కలిసివచ్చే అంశాలు.

# జీవనోపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు..

సంగారెడ్డి, అక్టోబరు 13 తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం తీవ్రమైన వలసల సంక్షోభంతో అల్లాడుతోంది. వర్షాలు లేకపోవడం, కరెంటు కోతలతో పంటలు ఎండిపోవడం, స్థానికంగా ఉపాధి అవకాశాలు కరువవడంతో వేలాది మంది గిరిజన కుటుంబాలు పొట్టకూటి కోసం వలస బాట పడుతున్నాయి. పిల్లా జెల్లలతో ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై సాగే ఈ వలసలు "బండి వెనక బండి కట్టి" అనే చైతన్య గీతికను గుర్తుకు తెస్తున్నాయి.

తరాలు మారినా, ప్రభుత్వాలు మారినా ఈ వలసల విపత్తుకు కళ్లెం వేయలేకపోవడం ప్రభుత్వాల వైఫల్యాన్ని స్పష్టం చేస్తోంది. నారాయణఖేడ్ నియోజకవర్గంలో 167 రెవెన్యూ గ్రామాలు, 218 తండాలు ఉన్నాయి. సుమారు 70 వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. స్థానికంగా ఉపాధి లేకపోవడంతో, ప్రతి ఏటా చెరుకు కోత సీజన్ వచ్చిందంటే చాలు, తండాలు ఖాళీ అవ్వాల్సిందే. వృద్ధులు, చదువుకుంటున్న పిల్లలు తప్ప మరెవరూ కనిపించరు. కొందరు తమ పిల్లలను బడి మాన్పించి మరీ తమతో పాటు వలసకు తీసుకువెళ్తున్నారు. చక్కెర కర్మాగారాలు తెరుచుకునే సమయంలో, దళారుల ద్వారా ముందే అడ్వాన్సులు తీసుకుని కుటుంబాలతో సహా వలస వెళు ్తంటారు. నారాయణఖేడ్ గిరిజనులది ప్రధానంగా వర్షాధారిత వ్యవసాయం. వర్షాలు సక్రమంగా పడకపోవడం, ఉన్న కొద్దిపాటి భూమిలో పంటలు వేసినా కరెంటు సమస్యలు, వాతావరణ పరిస్థితులు తీవ్ర భారాన్ని మోపుతున్నాయి. దీనితో చేతినిండా పనిలేక, అప్పుల పాలై, బతుకు దెరువు కోసం వలసలు అనివార్యమవుతున్నాయని గిరిజనులు వాపోతున్నారు."మాకు ఏమీ లేవు. నీళ్లు బారట్లేదు. పొలాలు ఎండిపోతున్నాయి. 70 సంవత్సరాల వయసులో కూడా నేను చెరుకు కొట్టడానికి వెళ్తున్నాను.

ఇక్కడ ఫ్యాక్టరీ లేదు, ఏదీ లేదు. మాకు తినడానికి కూడా లేవు" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు సమస్యలు వానాకాలంలోనూ, ఎండాకాలంలోనూ తమను వేధిస్తున్నాయని, అందుకే పిల్లలతో సహా చెరుకు కోతకు వెళ్తున్నామని మరొక గిరిజనుడు పేర్కొన్నారు. జహీరాబాద్, సంగారెడ్డి జిల్లాల నుంచే కాకుండా, కర్ణాటక, మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాలకు సైతం ఈ వలసలు సాగుతున్నాయి. వలస వెళ్లిన చోట కొన్నిసార్లు ప్రమాదాల బారిన పడుతున్నామని, అప్పుడు తమ కుటుంబాలు దిక్కు లేకుండా తయారవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వలస బాట పట్టిన వారంతా వచ్చే ఏడాది మార్చి నాటికి సొంతూళ్లకు చేరుకుంటారు. ప్రజల ఆశ ఒక్కటే. "ఈ వలసల నివారణ కోసం ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి. మా ఎమ్మెల్యే గారు, ఎంపీ గారు చొరవ తీసుకొని పరిశ్రమలు ఏర్పాటు చేసి తక్షణమే నివారణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మేము కోరుతున్నాం. మాకు స్థానికంగా జీవనోపాధి కల్పిస్తే ఇక్కడే పనులు చేసుకుంటాం" అని తండావాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. స్థిరమైన ఉపాధి అవకాశాలు, వ్యవసాయానికి సరైన మద్దతు లేకపోవడం నారాయణఖేడ్ గిరిజనుల జీవితాలను అగమ్యగోచరంగా మార్చుతోంది. ఈ సంక్షోభంపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి, దీర్ఘకాలిక పరిష్కారాలను కనుగొనాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# దాదాపు 1.42 లక్షల ఫ్లాట్లు

హైదరాబాద్ , అక్టోబరు 13 వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ఒకవైపు రికార్డు స్థాయిలో కొత్త ప్రాజెక్టుల ప్రారంభం కొనసాగుతుండగానే, మరోవైపు అమ్ముడుపోని ఇళ్ల సంఖ్య ఆందోళనకర స్థాయికి చేరుకుంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ డేటా అనాసిస్ సంస్థ క్రి మ్యాట్రిక్స్' విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, భాగ్యనగరంలో కొత్త ఫ్లాట్ల లాంచ్‌లు ఏకంగా 120 శాతం పెరిగినప్పటికీ? మార్కెట్లో దాదాపు 1.42 లక్షల ఫ్లాట్లు కొనుగోలుదారులు లేక అమ్ముడుపోకుండా మిగిలిపోయాయని సంచలన విషయాలు వెల్లడించింది.నగరంలో ముఖ్యంగా గచ్చిబౌలి, తెల్లాపూర్, కోకాపేట, ఇతర పశ్చిమ నగర పరిసరాల్లో లగ్జరీ, హై-రైజ్ ప్రాజెక్టులను బిల్డర్లు భారీగా మార్కెట్లోకి తీసుకొచ్చారు. అయితే, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు , ఐటీ రంగానికి చెందిన నియామకాల మందగమనం వల్ల ప్రాథమిక కొనుగోలుదారైన ఐటీ ఉద్యోగుల నుంచి కొనుగోలు వేగం ఆశించిన స్థాయిలో లేకపోవడమే ఈ ఇన్వెంటరీ పెరిగిపోవడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు.ప్రాజెక్టులను వేగంగా ప్రారంభించడం, భూముల ధరలు అమాంతం పెరగడం వల్ల బిల్డర్లు సరఫరాను విపరీతంగా పెంచేసినప్పటికీ, దానికి తగినట్లుగా డిమాండ్ పుంజుకోకపోవడంతో ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది ప్రాజెక్టులు నిర్మిస్తున్న డెవలపర్లపై ఆర్థిక భారంగా మారడంతో పాటు, భవిష్యత్తులో ధరల స్థిరీకరణకు లేదా కొత్త లాంచ్‌ల నెమ్మదించడానికీ దారితీసే అవకాశాలు ఉన్నాయి.అయితే, రాత్రికి రాత్రే ఇళ్లు అమ్ముడుపోకపోవడం వల్ల క్రమంగా మార్కెట్ కొనుగోలుదారుల అనుకూల మార్కెట్ గా మారే అవకాశం ఉందని మార్కెట్ రంగానికి చెందిన భావిస్తున్నారు. బిల్డర్లు నిల్వ ఉన్న ఇన్వెంటరీని వదిలించుకునేందుకు ప్రాజెక్టుల ధరలను స్థిరీకరించడం, సడలింపులు ఇవ్వడం లేదా నూతన ఆఫర్లు ప్రకటించడం ద్వారా రాబోయే రోజుల్లో కొనుగోలుదారులను ఆకర్షించేందుకు వ్యూహాలు మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. విపరీతంగా కొత్త ప్రాజెక్టులు ప్రారంభమై, అమ్ముడుపోని ఇళ్లు లేదా ప్లాట్ల సంఖ్య భారీగా పేరుకుపోయిన ప్రాంతాల్లో కొత్తగా పెట్టుబడులు పెట్టడం తీవ్ర రిస్క్‌తో కూడుకున్న పని. ఇన్వెంటరీ ఎక్కువగా ఉన్న ఏరియాల్లో డెవలపర్లు సేల్స్ కోసం ధరలను తగ్గించడమో లేదా నిలకడగా ఉంచడమో చేయాల్సి వస్తుంది. దీనివల్ల రీసేల్ మార్కెట్‌లో ప్రాపర్టీని అమ్మాలనుకున్నప్పుడు సరైన కొనుగోలుదారులు లభించక, ఆస్తి నామ్‌కేవాస్తేగా మిగిలిపోయి పెట్టుబడి లాక్ అయిపోయే ప్రమాదం ఉంది.దీనికి భిన్నంగా? కొత్త లాంచ్‌లు తక్కువగా ఉండి, కొనుగోలుదారుల డిమాండ్ నిరంతరం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంచుకోవడం ద్వారా వేగవంతమైన క్యాపిటల్ అప్రిషియేషన్ సాధించవచ్చు.

ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్న ఐటీ, కమర్షియల్ కారిడార్లు, మౌలిక వసతులు వేగంగా విస్తరిస్తున్న ప్రాంతాల్లో అబ్సార్ప్షన్ రేట్ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ఆస్తులకు స్థిరమైన గిరాకీ ఉండటమే కాకుండా అద్దె ఆదాయం, అత్యవసర వేళల్లో రీసేల్ లిక్విడిటీ తక్షణమే లభిస్తాయి.

అందుకే తెలివైన ఇన్వెస్టర్లు ప్రకటనలు, ఆకర్షణీయమైన ఆఫర్లను చూసి భావోద్వేగంతో నిర్ణయాలు తీసుకోకుండా? మార్కెట్ డేటా, ఇన్వెంటరీ నివేదికలను క్రమం తప్పకుండా విశ్లేషిస్తారు. మార్కెట్లో సరఫరా కన్నా డిమాండ్ బలంగా ఉన్న ఏరియాలను గుర్తించి పెట్టుబడి పెట్టడమే రియల్ ఎస్టేట్‌లో నష్టాల బారి నుండి కాపాడుకుంటూ సురక్షితమైన ఆర్థిక వృద్ధిని సాధించేందుకు మార్గం.

# సన్న బియ్యం ఎగుమతికి తెలంగాణ ప్రణాళికలు

హైదరాబాద్ , అక్టోబరు 13 తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో పండుతున్న మేలురకం సన్న బియ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్లకు పరిచయం చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఆసియా, ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల్లోని కొనుగోలుదారులతో దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాలు కుదుర్చుకోవడంపై దృష్టి సారించింది. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన 'అంతర్జాతీయ ప్రపంచ వరి సదస్సు (ఐడబ్ల్యుఆర్‌సీ) 2026'లో ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తన లక్ష్యాలను స్పష్టం చేసింది.ఈ సదస్సులో పాల్గొన్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ, తెలంగాణ బియ్యాన్ని నేరుగా కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలని అంతర్జాతీయ రిటైలర్లు, ఫుడ్ కంపెనీలు, ఎగుమతిదారులను ఆహ్వానించారు. కేవలం దేశీయంగా మిగులు నిల్వలను నిర్వహించడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్లలో అధిక విలువను సృష్టించడంపై దృష్టి సారించామని ఆయన వివరించారు. దేశీయ ఆహార భద్రతకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ ప్రణాళికలు అమలు చేస్తామని తెలిపారు.గత సీజన్‌లో తెలంగాణలో 18.5 మిలియన్ టన్నుల వరి ఉత్పత్తి జరిగిందని, ఇది దేశ మొత్తం ఉత్పత్తిలో దాదాపు 12 శాతమని స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. విదేశీ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అధిక నాణ్యత కలిగిన సన్న, మేలురకం బియ్యాన్ని బ్రాండెడ్, ట్రేసబుల్ (ఎక్కడ పండిందో గుర్తించే వీలున్న) పద్ధతిలో సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. గత ఏడాది ఫిలిప్పీన్స్‌కు 30,000 టన్నుల బియ్యాన్ని విజయవంతంగా ఎగుమతి చేసిన అనుభవంతో ఈ కొత్త ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు.ఒకవైపు ప్రభుత్వం ఎగుమతులపై దృష్టి సారిస్తుండగా, మరోవైపు రాష్ట్రంలో సన్న బియ్యం ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. 'సన్న బియ్యం' పీడీఎస్ పథకం కింద ప్రభుత్వం పెద్ద ఎత్తున ధాన్యం సేకరించడం, కొన్ని జిల్లాల్లో వరి సాగు తగ్గడం, ఎల్ నినో ప్రభావంపై ఆందోళనల కారణంగా బహిరంగ మార్కెట్‌లో బియ్యం లభ్యత తగ్గింది. దీంతో కొద్ది వారాల క్రితం కిలో రూ.70 ఉన్న సన్న బియ్యం ధర ఇప్పుడు రూ.80-82కి చేరింది. 25 కిలోల బస్తా ధర రూ.2,150 సమీపంలో పలుకుతోంది.ఇదే సమయంలో, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే సేకరణ వ్యయం అధికంగా ఉండటంతో ఎగుమతుల్లో పోటీని తట్టుకోలేకపోతున్నామని కొందరు మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. థాయ్‌లాండ్, వియత్నాం నుంచి తక్కువ ధరకే బియ్యం అందుబాటులో ఉండటం మధ్యప్రాచ్యం, పశ్చిమాఫ్రికా మార్కెట్లలో భారత బియ్యంపై ప్రభావం చూపుతోందని వారు పేర్కొంటున్నారు. అయితే, దేశీయ అవసరాలు, రైతుల నుంచి ధాన్యం సేకరణకు తొలి ప్రాధాన్యం ఇస్తూనే ఎగుమతి అవకాశాలను అన్వేషిస్తామని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

# హైస్పీడ్ రైల్ కారిడార్ల చిచ్చు!

హైదరాబాద్ , అక్టోబరు 13 హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదించిన హైస్పీడ్ రైల్ కారిడార్ల వ్యవహారం ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజకీయ రగడకు కారణమవుతోంది. ఒకవైపు రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసి, భూసేకరణకు హడావుడి చేస్తుంటే.. మరోవైపు అలైన్‌మెంట్ ఇంకా ఖరారే కాలేదని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ పరిణామాలు కేవలం సాంకేతిక లోపాలా లేక రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న వ్యూహాలా అనే అనుమానాలకు తావిస్తున్నాయి.తెలంగాణ మీదుగా ముంబై, బెంగళూరు, చెన్నైలకు హైస్పీడ్ రైల్ కారిడార్ల ఏర్పాటు కోసం గతంలో రైల్వే అధికారులతో అనేక దఫాలు చర్చలు జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైన రైల్వే అధికారులు.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలోని బహాదూర్‌గూడలో రైల్ హబ్ కోసం 400 ఎకరాలు కేటాయించడాన్ని ప్రాథమికంగా ఖరారు చేసుకున్నారు.

రాష్ట్ర కేబినెట్ సైతం దీనికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది.అంతర్గతంగా మార్గాలను నిర్ణయించుకున్న అధికారులు, హాలియా వంటి పలు ప్రాంతాల్లో ఎరుపు, తెలుపు రంగులతో మార్కింగ్‌లు కూడా చేశారు. తెలంగాణ పరిధిలో ముంబై-పుణే కారిడార్ 93 కిలో మీటర్లు, హైదరాబాద్-బెంగళూరు 205 కిలోమీటర్లు, హైదరాబాద్-చెన్నై 180 కిలోమీటర్ల చొప్పున మార్గాలను ప్రతిపాదించారు. ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పక్కనే వెళ్లేలా సవరణలు కూడా చేశారు. ఇదంతా సజావుగా సాగుతుందనుకున్న తరుణంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ చేసిన ప్రకటన ఈ ప్రణాళికలన్నింటినీ ఒక్కసారిగా గందరగోళంలోకి నెట్టింది.కారిడార్ల అలైన్‌మెంట్ ఇంకా ఖరారు కాలేదని, భూసేకరణ చేయడం నిబంధనలకు విరుద్ధమని కేంద్ర మంత్రి స్పష్టం చేయడం వెనుక రాజకీయ కోణం స్పష్టంగా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని, భూముల గుర్తింపు కోసం అధికారులను రంగంలోకి దించడం, దీనివల్ల ప్రజల్లో భయాందోళనలు తలెత్తడం రాజకీయంగా అధికార పార్టీకి ఇరుకును తెస్తోంది. క్షేత్రస్థాయిలో మార్కింగ్‌లు వచ్చిన తర్వాత, అసలు అలైన్‌మెంట్ ఖరారే కాలేదనడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపాన్ని లేదా రాజకీయ లబ్ధి కోసమే ఉద్దేశపూర్వకంగా చేస్తున్న జాప్యాన్ని ఎత్తిచూపుతోంది.

ఒకవైపు అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో తాము వేగంగా అడుగులు వేస్తుంటే, కేంద్రం మాత్రం నిబంధనల పేరుతో బ్రేకులు వేస్తోందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా ముందుకు వెళ్తే సహించేది లేదనే సంకేతాలను కేంద్రం పంపుతోంది. మొత్తానికి, హైస్పీడ్ రైల్ కారిడార్ల అలైన్‌మెంట్ తకరారు కేవలం సాంకేతిక సమస్య కాస్తా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున రాజకీయ రగడగా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

### తెలంగాణకు ఎల్నినో గండం..

### 50 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం

హైదరాబాద్ ఎల్ నినో గండంతో రాష్ట్రంలో రానున్న 10 నెలలు, ఆపై కూడా తీవ్ర కరువు పరిస్థితులు ఉండే అవకాశం వుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ములుగు నియోజకవర్గంలో విద్యుత్ కోతలతో పంటలు ఎండుతున్నాయి. మంగపేట, ఏటూరునాగారం, తాడ్వాయి మండలాల్లో విద్యుత్ కోతల వల్ల పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం 24 గంటలు కరెంటు ఇస్తున్నామని చెప్తున్నా, క్షేత్రస్థాయిలో కేవలం 5 నుంచి 6 గంటల కరెంటు మాత్రమే వస్తోందని రైతుల ఆందోళన. తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం కుడా వుందని సమాచారం. పంటలకు సాగునీరు అందించడం కష్టమే.. వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపనుంది. భూగర్భ జలమట్టాలు రోజుకు దాదాపు మూడు అడుగుల మేర పడిపోతున్నాయి. సాధారణ స్థాయితో పోలిస్తే ప్రస్తుతం రాష్ట్రంలోని జలాశయాల నీటి నిల్వలు 50 శాతమే ఉన్నాయి. అందుబాటులో ఉన్న నీటిని తాగునీరు, పశువుల అవసరాలకే వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

# హైదరాబాద్ రవాణా ముఖచిత్రంలో భారీ మార్పులు!

హైదరాబాద్ , అక్టోబరు 13 మెట్రో నగరాలలో ట్రాఫిక్ రద్దీ పెద్ద సమస్యగా మారింది. నగరాల సుందరీకరణ, ప్రయాణ సౌలభ్యం కోసం ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నాయి. అయితే.. క్షేత్రస్థాయి పరిస్థితులు, వ్యయ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు కొన్ని ప్రాజెక్టులకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. తాజాగా హైదరాబాద్ లో అత్యంత రద్దీ ప్రాంతమైన కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చేపట్టాల్సిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ ప్రణాళికలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ పలు మార్పులు చేసింది.గతంలో ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం, కేబీఆర్ పార్క్ చుట్టూ దాదాపు రూ.1,090 కోట్ల వ్యయంతో ఏడు అండర్‌పాస్‌లు, ఏడు ఫ్లైఓవర్లను నిర్మించాలని నిర్ణయించారు. అయితే.. నగరంలో మారుతున్న ట్రాఫిక్ అవసరాలు, స్థానిక భౌగోళిక పరిస్థితులు, వ్యయ నియంత్రణను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టుల రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ, స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు.కొత్త ప్రణాళికల ప్రకారం, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముఫ్కంజా ఇంజనీరింగ్ కాలేజీ వరకు రూ.715.16 కోట్ల అంచనా వ్యయంతో సరికొత్త స్టీల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. దీనివల్ల గతంలో ప్రతిపాదించిన బంజారాహిల్స్ నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద 2-లేన్ సింగిల్ వే ఫ్లైఓవర్, టీవీ9 జంక్షన్ వద్ద అండర్‌పాస్‌లు వంటి అనేక పనులను రద్దు చేశారు. ఈ మార్పుల వల్ల గతంలో కేఎన్ఆర్ కన్స్ట్రక్షన్స్‌కు ఇచ్చిన కాంట్రాక్ట్ అగ్రిమెంట్‌ను రద్దు చేశారు. అంతేకాక, ఆ ఏజెన్సీ చెల్లించిన డిపాజిట్లను వెనక్కి ఇవ్వాలని నిర్ణయించారు.మొత్తం ప్రాజెక్టును రెండు ప్యాకేజీలుగా విభజించి పనులను వేగవంతం చేయాలని కమిటీ భావిస్తోంది. ప్యాకేజీ-1 పరిధిని జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ నుంచి ముగ్ధ జంక్షన్ వరకు స్టీల్ ఫ్లైఓవర్‌గా మార్చాలని నిర్ణయించారు. గతంలో రూ.580 కోట్లుగా అంచనా వేసిన ఈ ప్రాజెక్టు వ్యయాన్ని సవరిస్తూ, రూ.365.85 కోట్లకు కుదించారు. అలాగే రోడ్డు నంబర్-45 జంక్షన్, ఫిలింనగర్ జంక్షన్ ప్రాంతాల్లోని పనుల ప్రణాళికను కూడా మార్చారు.ప్యాకేజీ-2 కింద ముగ్ధ జంక్షన్ నుంచి ముఫ్కంజా కాలేజీ వరకు, బంజారాహిల్స్ రోడ్డు నంబర్-1కి అనుసంధానించే రాంపుతో కూడిన స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. రూ.510 కోట్లుగా ఉన్న ఈ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.349.31 కోట్లకు సవరించారు. ఈ రెండు ప్యాకేజీల నిర్మాణ పనులను ప్రస్తుతం మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సంస్థకు అప్పగించాలని స్టాండింగ్ కమిటీ నిర్ణయించింది.కేవలం రవాణా రంగానికే కాకుండా, నగరంలోని ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి కూడా స్టాండింగ్ కమిటీ పెద్దపీట వేసింది. ఆరాంఘర్ ? జూపార్కు మార్గంలో 6-లేన్ గ్రేడ్ సెపరేటర్ నిర్మాణానికి రూ.799.74 కోట్ల సవరించిన అంచనాలను ఆమోదించారు. అలాగే ఒవైసీ హాస్పిటల్, బహాదుర్‌పురా జంక్షన్ల వద్ద మల్టీలెవెల్ ఫ్లైఓవర్ల కోసం రూ.161 కోట్లు కేటాయించారు. మరోవైపు, జీహెచ్ఎంసీ పరిధిలోని చెరువుల పునరుద్ధరణ, డ్రైనేజీ వ్యవస్థల ఆధునికీకరణ, ఘన వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించారు. చింతల్ చెరువుకు రూ.20 కోట్లు, రాంపల్లి చెరువు అభివృద్ధికి రూ.40 కోట్లు మంజూరు చేయడం ద్వారా జలవనరుల పరిరక్షణకు పెద్దపీట వేసినట్లైంది.

# మెదక్‌లో చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం..

## రజక సంఘం ఆందోళన



మెదక్ పట్టణంలో తెల్లవారుజామున చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం కావడం కలకలం రేపింది. ఈ విషయం తెలుసుకున్న రజక సంఘం నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలో విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటన నేపథ్యంలో సీఐ మహేష్ ఆధ్వర్యంలో విగ్రహం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిరసనకారులు సంయమనం పాటించాలని సీఐ సూచించారు. ఘటనపై పోలీసు దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి బాధ్యులను గుర్తిస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. విగ్రహం ధ్వంసం ఘటనపై రజక సంఘం నాయకులు పోలీసుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారు. విగ్రహం వద్ద సరైన కోణంలో సీసీ కెమెరాలు లేకపోవడం, అందుబాటులో ఉన్న కెమెరాలు ఘటనను స్పష్టంగా గుర్తించే విధంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ, ఆమె విగ్రహానికి తగిన భద్రత కల్పించకపోవడంపై పలువురు విమర్శలు గుప్పించారు. విగ్రహం ధ్వంసం విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఘటనాస్థలానికి చేరుకుని రజక సంఘం నాయకులకు మద్దతు తెలిపారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం ఘటనపై రజక సంఘం ఆధ్వర్యంలో మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టాల్సి ఉంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# చిన్నశేష వాహనంపై ద్వారకా శ్రీకృష్ణుడి అలంకారంలో

## శ్రీ మలయప్పస్వామి దివ్యదర్శనం



తిరుమల, గోవింద నామస్మరణలు.. మంగళవాయిద్యాలు.. కోలాటాల నడుమ వైభవంగా వాహనసేవతిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై ద్వారకా శ్రీకృష్ణుడి అలంకారంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. సర్వాలంకార భూషితుడైన స్వామివారిని దర్శించుకుని భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.ముందుగా గజాలు, అశ్వాలు నడుస్తుండగా, భక్తుల కోలాటాలు, మంగళవాయిద్యాలు, వివిధ కళాబృందాల ప్రదర్శనల నడుమ వాహనసేవ కన్నులపండువగా సాగింది. గోవింద నామస్మరణలతో తిరుమల మాడ వీధులు మార్మోగాయి.చిన్నశేష వాహనం ? కుటుంబ శ్రేయస్సుకు ప్రతీకవైష్ణవ సంప్రదాయంలో భగవంతుడిని 'శేషి'గా, ప్రపంచాన్ని 'శేషభూతం'గా భావిస్తారు. నాగరాజైన వాసుకిని ప్రతిబింబించే చిన్నశేష వాహనం ఈ శేషి భావాన్ని చాటిచెబుతుంది. చిన్నశేష వాహనంపై స్వామివారిని దర్శించుకోవడం వల్ల కుటుంబ శ్రేయస్సు కలుగుతుందని, కుండలినీ యోగసిద్ధి ఫలాలు లభిస్తాయని భక్తుల విశ్వాసం.

# చెరుకు రైతుకు గిట్టుబాటు ధర ఏదీ ?

## తగ్గిన దిగుబడి, పెరిగిన పెట్టుబడి ఖర్చులతో అన్నదాతల ఆవేదన

జహీరాబాద్, అక్టోబర్ 13 చెరుకు రైతులకు ఈ ఏడాది కష్టాలు తప్పడం లేదు. ఒకవైపు వర్షాభావంతో దిగుబడి తగ్గిపోగా, మరోవైపు ఎరువులు, కూలీలు, రవాణా ఖర్చులు పెరగడంతో పెట్టుబడి భారంగా మారింది. పంట సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. తమకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని జహీరాబాద్ డివిజన్ చెరుకు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సగానికి పడిపోయిన దిగుబడి.. పెరిగిన ఖర్చులుఈ ఏడాది జూన్, జులై నెలల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో చెరుకు పంట ఎదుగుదలపై ప్రభావం పడిందని రైతులు చెబుతున్నారు. గతంలో ఎకరాకు 45 టన్నుల వరకు దిగుబడి వచ్చేదని, ప్రస్తుతం 20 నుంచి 25 టన్నులకే పరిమితమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడి తగ్గడంతో పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. చెరుకు సాగులో ఎరువులు, దుక్కి దున్నడం, పంట కోత, రవాణా ఖర్చులు రైతులకు భారంగా మారాయి. కూలీలకు రోజుకు రూ.500 నుంచి రూ.600 వరకు చెల్లించాల్సి వస్తోందని చెబుతున్నారు. చెరుకును ఫ్యాక్టరీకి తరలించే రవాణా ఖర్చులు కూడా తమపైనే పడుతున్నాయని పేర్కొంటున్నారు. దిగుబడి తగ్గిన సమయంలో ఖర్చులు పెరగడంతో నష్టాలు మరింత ఎక్కువవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.టన్నుకు రూ.6 వేలు చెల్లించాలని డిమాండ్ చెరుకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించాలని రైతులు కోరుతున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి టన్నుకు రూ.5,500 ధర నిర్ణయించాలని, అదనంగా ప్రభుత్వం రూ.500 సబ్సిడీ అందించాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతోపాటు పంట కోత, రవాణా ఖర్చులను ఫ్యాక్టరీ యాజమాన్యాలే భరించాలని కోరుతున్నారు. ఈ ప్రతిపాదనల ప్రకారం టన్నుకు మొత్తం రూ.6 వేల ఆదాయం లభిస్తేనే తమకు గిట్టుబాటు అవుతుందని చెబుతున్నారు. న్యాల్కల్ మండలం మామిడిగి గ్రామానికి చెందిన రైతు రాజిరెడ్డి తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఎరువుల కోసం అప్పులు చేయాల్సి వస్తోందని, పంటకు సరైన ధర లభించకపోతే వాటిని ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం, ఫ్యాక్టరీ యాజమాన్యాలు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే ఏడాది చెరుకు సాగు చేయడం కష్టమవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# వ్యవసాయానికి నిరంతర విద్యుత్ ఇవ్వాలి..

## చెల్పూరులో జాతీయ రహదారిపై బీఆర్ఎస్ నాయకుల ధర్నా



జయశంకర్ భూపాలపల్లి రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు గ్రామంలో జాతీయ రహదారిపై భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. రైతులకు నిరంతర విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ధర్నాలో గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ప్రస్తుతం కనీసం ఐదు నుంచి ఆరు గంటల పాటు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆరోపించారు. విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సరైన సమయంలో విద్యుత్ అందక పంటలు ఎండిపోతున్నాయని, పొలాల్లో భూమి బీటలు వారుతోందని పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఇతర పార్టీ శ్రేణులు పాల్గొని రైతులకు మద్దతుగా నినాదాలు చేశారు.

# బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి

## తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేడు బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన.. జగన్మాత ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని, రైతన్నల పంటలు సమృద్ధిగా పండి రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయన శరన్నవరాత్రుల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఎల్‌నినో దెబ్బ.. తీవ్ర సాగు, తాగునీటి ఎద్దడి..

## యాసంగి పంటలపై ప్రభుత్వం కీలక ప్రకటన

ఖమ్మం తెలంగాణ రాష్ట్రాన్ని ఎల్ నినో గండం ముంచెత్తుతోంది. రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది.రానున్న రోజుల్లో తాగునీరు, సాగునీటితోపాటు విద్యుత్ సరఫరాపై కూడా తీవ్ర ఒత్తిడి పడే అవకాశం ఉందని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రైతాంగం యాసంగి సాగు విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పొలాల్లో ఉన్న పంటలను ఎలాగోలా కాపాడేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని.. అయితే భవిష్యత్తులో ఎదురయ్యే తీవ్ర నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని.. ఈసారి యాసంగి పంటలు వేయకుండా రైతులు సహకరించాలని కోరారు.ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గంలో మంత్రులు పర్యటించారు. అనంతరం ఎల్ నినో పరిస్థితులపై చర్చించారు. రానున్న రోజుల్లో వర్షాలు ఆశించిన మేర కురిసే అవకాశం ఉండకపోవచ్చన్నారు. వ్యవసాయానికి అవసరమైన నీటితోపాటు ప్రజలు తాగునీటి అవసరాలను తీర్చడం కూడా సవాలుగా మారే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే సాగు చేసిన పంటలకు సాధ్యమైనంత వరకు నీటిని అందించి వాటిని కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. రెండో పంట వేసి ఆ తర్వాత నీరు అందక పంటలు ఎండిపోయినట్లయితే.. రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని మంత్రులు హెచ్చరించారు. అందువల్ల పరిస్థితులను అర్థం చేసుకుని యాసంగి సాగు విషయంలో ప్రభుత్వం సూచనలను పాటించాలని రైతులను కోరారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించు కోవడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను కొంతమేర తగ్గించే అవకాశం ఉందని తెలిపారు.నీటి లభ్యతపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోతే, అది తాగునీటి సరఫరాతో పాటు సాగునీరు, జలవిద్యుత్ ఉత్పత్తిపై కూడా ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. పంటలు వేసే ముందు నీటి లభ్యతను అంచనా వేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ముందుగా ప్రజల తాగునీటి అవసరాలను తీర్చాలని ఆయన అన్నారు. వర్షపాతం లేకపోవడంతో పాటు, విద్యుత్ సరఫరాలో కూడా సమస్యలు తలెత్తే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి అన్నారు. బయటి మార్కెట్ నుండి నిత్యావసర విద్యుత్‌ను కొనుగోలు చేయడం రోజురోజుకు ఖరీదైనదిగా మారుతోందని ఆయన అన్నారు. యూనిట్‌కు రూ.15 చెల్లించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రజలకు విద్యుత్ లభించని పరిస్థితులు కూడా ఉన్నాయని ఆయన చెప్పారు. ప్రజలు అవసరమైనంత మాత్రమే విద్యుత్‌ను వాడుకుని డబ్బు ఆదా చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కోవడానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాలను కవర్ చేస్తూ ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. రాబోయే ఎనిమిది నెలలు కీలకమని పేర్కొంటూ, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలలో అవగాహన పెంచాలని ఆయన సూచించారు. పంట కోత పూర్తయ్యే వరకు నీటి కొరతను నివారించడానికి, ఒక్క చుక్క నీరు కూడా వృధా కాకుండా చూసుకోవడానికి అధికారులు తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక వార్ రూమ్ మరియు టోల్-ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయడంపై కూడా దృష్టి సారించింది. కరువును ఎదుర్కొంటున్న జిల్లాలకు సహాయం అందించడానికి మరియు కరువు నివారణ చర్యలను అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం నుండి రూ. 20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని అభ్యర్థించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుత 125 పనిదినాలకు అదనంగా, గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మరో 50 రోజుల పనిని అభ్యర్థించే విషయాన్ని కూడా పరిశీలిస్తోంది.ఎల్ నినో ప్రభావం, కరువు పరిస్థితి, రైతుల సమస్యలు, తాగునీరు మరియు సాగునీటి అవసరాలు, విద్యుత్ సరఫరాపై చర్చించేందుకు ముఖ్యమంత్రి నేతృత్వంలో త్వరలో ఒక ప్రత్యేక సమావేశం జరగనున్నట్లు తెలిసింది. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు రాబోయే నెలల్లో ప్రభుత్వ పనితీరుకు మార్గదర్శకంగా ఉంటాయి.

# పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి..

## ముగ్గురు అరెస్ట్.. రూ.17,300 నగదు స్వాధీనం



మెదక్, అక్టోబర్ 13: మెదక్ జిల్లాలో పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసులు నిఘా కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా కుల్చారం మండలం పోతన్‌శెట్టిపల్లి గ్రామంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్ వద్ద పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో మెదక్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.17,300 నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిని కుల్చారం గ్రామానికి చెందిన సత్యనారాయణ, శేఖర్, నర్సింలుగా గుర్తించారు. పేకాటకు సంబంధించి కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లాలో పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, సమాచారం అందిన వెంటనే దాడులు నిర్వహించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పేకాట లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

# మున్సిపల్ శాఖలో కొంతమంది అధికారుల బదిలీలు, పోస్టింగులపై పునఃసమీక్షించాలి

## ముఖ్యమంత్రికితెలంగాణ రాష్ట్ర మున్సిపాలిటీ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎల్.తాజ్ మోహన్ రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**

హైద్రాబాద్ అక్టోబర్ 13:మున్సిపల్ శాఖలో కొంతమంది అధికారుల బదిలీలు, పోస్టింగులపై పునఃసమీక్షించాలనితెలంగాణ రాష్ట్ర మున్సిపాలిటీ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎల్.తాజ్ మోహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రెవెంత్ రెడ్డికి లేఖ రాశారు.



నేను తెలంగాణ రాష్ట్ర మున్సిపాలిటీ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఉద్యోగుల ప్రయోజనాలకు సంబంధించిన కొన్ని విషయాలను దృష్టికి తీసుకువస్తున్నానని పేర్కొన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మమత జోనల్ కమిషనర్గా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో పనిచేయడంతో పాటు, అంతకుముందు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో కూడా పనిచేశారు. ఆ సమయంలో తెలంగాణ మున్సిపల్ ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని మా సంఘం దృష్టికి వచ్చింది.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మమత ని ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేయడం జరిగింది. అయితే, ఆ బదిలీ అమలులో ఉన్న సమయంలోనే ఆమె అమెరికాకు వెళ్లి, సుమారు ఆరు నెలల తరువాత తిరిగి భారతదేశానికి వచ్చారు. అనంతరం తిరిగి డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో అసిస్టెంట్ డైరెక్టర్గా విధుల్లో చేరినట్లు మా దృష్టికి వచ్చింది.

అదేవిధంగా, మహేందర్ గతంలో కేటీఆర్ ఓఎస్డీగా పనిచేసిన సమయంలో పలు అక్రమాలు, అవినీతి వ్యవహారాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. అవినీతి ద్వారా భారీగా ఆస్తులు కూడబెట్టుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అనంతరం ఆయనను ఖమ్మం ప్రాంతానికి బదిలీ చేయడం జరిగింది. అయితే, ఇటీవల ఆయనను తిరిగి ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ముఖ్యమైన పదవిలో నియమించడం పట్ల తెలంగాణ మున్సిపాలిటీ ఉద్యోగుల సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది.

కావున, పై రెండు బదిలీలు మరియు తదనంతర పోస్టింగులను తమరు దయచేసి పునఃసమీక్షించి, అవసరమని భావించిన పక్షంలో సంబంధిత అధికారులను దూర ప్రాంతాలకు బదిలీ చేయవలసిందిగా మా సంఘం తరపున హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేసారు. తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపల్ ఉద్యోగుల ప్రయోజనాలను, వారి సంక్షేమాన్ని మరియు శాఖలో పారదర్శకమైన, క్రమశిక్షణతో కూడిన పరిపాలనను కాపాడేందుకు తమరు తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.

# నవ్వించిన నైవేద్యం



హైద్రాబాద్ అక్టోబర్ 13:సినీ రచయిత యం.వి.ఎస్. హరనాథ రావు, వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పిస్తూ.. జయా ఆర్ట్స్ హైదరాబాద్, లలిత కళా పరిషత్ అనంతపురం సంయుక్త నిర్వహణలో నైవేద్యం నాటికను ప్రదర్శించారు. ఆకలితో ఉన్న పేదవాడికి పిడికెడు మెతుకులు కూడా పెట్టించలేని మానవత్వం, దానిని ఆపలేని దైవత్వం మధ్య నడిచే కథాంశంతో ప్రేక్షకులను అలరించింది. అందరినీ కడుపుబ్బా నవ్వించి, అనంతరం ఆలోచింప జేసింది. ఇప్పటివరకు 45 నాటికలకు దర్శకత్వం వహించిన శ్రీజ 46 వ నాటికగా తనకు తనకు ఎంతో ఇష్టమైన ఈ నాటికకు దర్శకత్వం వహించడం సంతోషంగా ఉండడమే కాదు, హరనాథ రావు కి నివాళి అర్పించడమే అన్నారు.లలిత కళా పరిషత్ సెక్రటరీ గాజుల పద్మజ ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి, నాటిక ప్రదర్శనను విజయవంతం చేశారు. సినీనటులు, రంగస్థల దర్శకులు వెంకట్ గోవాడ ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరయ్యారు. అనంతరం దర్శకురాలు శ్రీజ సాదినేనిని ఘనంగా సత్కరించారు.

# ఖైరతాబాద్ ఉప ఎన్నికపై జనసేనలో ఆసక్తికర చర్చ!

## పవన్ కళ్యాణ్‌కు సన్నిహితుడైన పారిశ్రామికవేత్త కూటమికి సంబంధం లేకుండా సొంతంగా పోటీ చేసే ఆలోచనలో జనసేన !

హైదరాబాద్ అక్టోబర్ 13:: తెలంగాణ రాజకీయాల్లో జనసేన పార్టీ భవిష్యత్ కార్యాచరణపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో జనసేన తరఫున ఎవరిని బరిలోకి దింపుతారనే అంశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు సన్నిహితంగా ఉండే, పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ ప్రముఖ పారిశ్రామికవేత్తకు అవకాశం కల్పించే అంశంపై ప్రచారం సాగుతోంది.

సాఫ్ట్‌వేర్, వ్యాపార రంగాల్లో విశేష అనుభవం కలిగి, సమాజం పట్ల బాధ్యతతో పాటు ప్రజాసేవపై ఆసక్తి ఉన్న నాయకుడిని ఎన్నికల బరిలోకి దింపాలనే ఆలోచన పార్టీలో ఉందనే చర్చ వినిపిస్తోంది. వివాదాలకు దూరంగా ఉంటూ, వ్యాపార రంగంలో సంపాదించిన అనుభవాన్ని ప్రజాసేవకు వినియోగించగల వ్యక్తికి అవకాశం కల్పిస్తే పార్టీకి ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తెలంగాణలో జనసేనను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, యువతతో పాటు వివిధ సామాజిక వర్గాలకు చేరువ కావడం వంటి అంశాలపై పార్టీ దృష్టి సారిస్తున్న నేపథ్యంలో ఖైరతాబాద్ ఉప ఎన్నిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఎన్నిక ద్వారా పార్టీ ప్రజల్లో తన ఉనికిని మరింత బలోపేతం చేసుకునే అవకాశాలపైనా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.వ్యాపార, సాంకేతిక రంగాల్లో అనుభవం ఉన్న వ్యక్తులు రాజకీయాల్లోకి వస్తే అభివృద్ధి, ఉపాధి కల్పన, యువతకు అవకాశాలు, సామాజిక సంక్షేమం వంటి అంశాలపై వినూత్న ఆలోచనలకు అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సదరు పారిశ్రామికవేత్తకు జనసేన తరఫున అవకాశం దక్కుతుందా? తెలంగాణలో పార్టీ నాయకత్వం ఖైరతాబాద్ ఉప ఎన్నిక కోసం ఎలాంటి వ్యూహాన్ని అనుసరించనుంది? అన్న అంశాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.అయితే, ఖైరతాబాద్ ఉప ఎన్నికలో జనసేన అభ్యర్థి ఎంపికకు సంబంధించి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ప్రచారంలో ఉన్న ఈ అంశాలపై స్పష్టత రావాలంటే పార్టీ అధిష్ఠానం నిర్ణయం వెలువడే వరకు వేచి చూడాల్సిందే. రానున్న రోజుల్లో జనసేన అనుసరించే వ్యూహం, అభ్యర్థి ఎంపికపై వెలువడే ప్రకటన తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారనుంది.

# సిబ్బంది కొరత.. సౌకర్యాల లేమితో సతమతమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రులు!

## (సి.హెచ్. ప్రతాప్)

తెలంగాణలో ప్రభుత్వ ఆసుపత్రులను వేధిస్తున్న వైద్య సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాల లేమి, వైద్య పరికరాల నిర్వహణలో లోపాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిరుపేదలకు నాణ్యమైన చికిత్స అందించాల్సిన ఆసుపత్రుల్లో అత్యవసర మందులు, పరీక్షా పరికరాలు అందుబాటులో లేకపోవడం ప్రజారోగ్య వ్యవస్థ ముందున్న సవాళ్లను వెల్లడిస్తోంది. తాజాగా హైదరాబాద్‌లోని ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ వైద్యులు చేపట్టిన ఆందోళన ఈ సమస్య తీవ్రతను మరోసారి వెలుగులోకి తెచ్చింది.

అక్టోబర్ 12న ఉస్మానియా ఆసుపత్రిలో 500 మందికిపైగా జూనియర్ వైద్యులు, ఇంటర్న్లు, పీజీ, సూపర్ స్పెషాలిటీ వైద్యులు నిరసన తెలిపారు. అత్యవసర మందులు, స్టెంట్లు, కాథెటర్లు, ఎక్స్‌రే సామగ్రి కొరతతో చికిత్సలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. వెంటిలేటర్లు, ఎండోస్కోపీ పరికరాలు, క్యాథ్‌ల్యాబ్ వంటి సదుపాయాల్లో లోపాలున్నాయని ఆరోపించారు. గుండె, మూత్రపిండాలకు సంబంధించిన కొన్ని ప్రత్యేక వైద్యసేవలు నాలుగు నెలలుగా నిలిచిపోయాయని వైద్యుల సంఘం వెల్లడించింది. నిరసన కారణంగా సాధారణ ఓపీ సేవలు, ముందుగా నిర్ణయించిన శస్త్రచికిత్సలకు అంతరాయం ఏర్పడగా అత్యవసర వైద్యసేవలు కొనసాగాయి.

మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల ఖాళీలు తీవ్ర సమస్యగా మారాయి. సెప్టెంబరులో శాసనమండలికి సమర్పించిన ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం ప్రభుత్వ బోధన, ద్వితీయశ్రేణి ఆసుపత్రుల్లో మంజూరైన 7,515 వైద్య పోస్టుల్లో 2,238 ఖాళీగా ఉన్నాయి. అంటే దాదాపు 30 శాతం పోస్టులకు వైద్యులు లేరు. ద్వితీయశ్రేణి ఆసుపత్రుల్లో 4,092 పోస్టులకు 1,480 ఖాళీగా ఉండటం గమనార్హం. నిజామాబాద్, వికారాబాద్ జిల్లాల్లో ఈ విభాగంలో 55 శాతానికిపైగా ఖాళీలున్నాయి. అయితే ఈ గణాంకాలు రాష్ట్రవ్యాప్త పరిస్థితికి సంబంధించినవి. ఉస్మానియా వైద్య కళాశాలలో మంజూరైన పోస్టులకంటే ఎక్కువ మంది వైద్యులు పనిచేస్తున్నట్లు అధికారిక సమాచారం వెల్లడిస్తోంది.

జిల్లాస్థాయిలో వైద్య నిపుణుల కొరత కారణంగా రోగులు హైదరాబాద్‌లోని ప్రధాన ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఫలితంగా పెద్ద ఆసుపత్రుల్లో రద్దీ, వైద్యులపై పనిభారం పెరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే నిరుపేదలకు ప్రయాణ ఖర్చులు, చికిత్సలో జాప్యం అదనపు సమస్యలుగా మారుతున్నాయి. వైద్యులతోపాటు నర్సులు, ప్రయోగశాల సిబ్బంది, సాంకేతిక నిపుణులు, సహాయక సిబ్బంది అవసరాలను కూడా సమగ్రంగా సమీక్షించాలి.

ఆరోగ్యశ్రీ నిధుల విడుదలలో జాప్యం ఆసుపత్రుల నిర్వహణ, పరికరాల మరమ్మతులు, వైద్య సామగ్రి కొనుగోళ్లపై ప్రభావం చూపుతోందని జూనియర్ వైద్యుల సంఘం ఆరోపించింది. సమస్యల పరిష్కారానికి మౌఖిక హామీలు కాకుండా నిర్దిష్ట గడువులతో కూడిన కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని కోరింది.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆసుపత్రులవారీగా మౌలిక సదుపాయాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలి. ఖాళీ పోస్టులను ప్రాధాన్యక్రమంలో భర్తీ చేయడంతోపాటు పనిచేయని పరికరాలకు తక్షణ మరమ్మతులు చేపట్టాలి. మందుల నిరంతర సరఫరా, పరిశుభ్రమైన వార్డులు, తాగునీరు, మరుగుదొడ్లు, రోగుల విశ్రాంతి సదుపాయాలను మెరుగుపరచాలి. జిల్లా ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్యసేవలను బలోపేతం చేసి, నిధుల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి.

ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం పెరగాలంటే భవనాల నిర్మాణం ఒక్కటే సరిపోదు. ప్రతి ఆసుపత్రిలో అవసరమైన వైద్యుడు, మందు, పరికరం అందుబాటులో ఉండాలి. పేదవాడికి సకాలంలో ప్రాణరక్షణ చికిత్స అందినప్పుడే ప్రజారోగ్య వ్యవస్థ తన అసలైన లక్ష్యాన్ని సాధించినట్లు!

# ఒంటరితనం కేవలం ఒక భావోద్వేగ సమస్య మాత్రమే కాదు



వికారాబాద్ అక్టోబర్ 13; భౌతికముగా అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ఆప్యాయంగా మాట్లాడే మనిషి లేకపోవడం, తమ మాట వినే వారు లేకపోవడం, కుటుంబ సభ్యులతో సమయం గడప లేకపోవటం వంటి కారణాలు వారిని మానసికంగా కృంగదీస్తున్నాయని దీనికోసమే ప్రభుత్వం వారు డే కేర్ సెంటర్లను నిర్వహిస్తున్నారని దీన్ని ప్రతి ఒక్క వృద్ధులు సద్వినియోగపరచుకోవాలని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి కోరారు. ఒంటరితనం కేవలం ఒక భావోద్వేగ సమస్య మాత్రమే కాదు. అది ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ఎక్కువ కాలం ఒంటరిగా ఉండే వృద్ధుల్లో ఆందోళన, నిరాశ, నిద్రలేమి, జ్ఞాపకశక్తి సమస్యలు పెరిగే అవకాశం ఉందని సాయి చౌదరి తెలిపారు. కొన్నిసార్లు ఇది శారీరక ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తుందని, మనసుకు సంతోషం లేకపోతే శరీర ఆరోగ్యం కూడా క్షీణిస్తుందని, అందుకే వృద్ధుల మానసిక ఆరోగ్యం పై కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని వీటి కోసమే జిల్లాలో డే కేర్ సెంటర్లు నిర్వహిస్తున్నారని దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని సాయి చౌదరి అన్నారు.

# అమ్మవారి ఆలయానికి రక్షణ కల్పించండి

## హిందువుల మనోభావాలను గౌరవించండి
## ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సంపత్ కుమార్ మాదిగ

హైదరాబాద్ అక్టోబర్ 13 'అపరిశుభ్రతల మధ్య అమ్మవారి ఆలయం' అనే శీర్షికతో పలు దినపత్రికలోసోమవారం వచ్చిన వార్త కతనాలపై ఎమ్మార్పీఎస్ నాయకులు సంపత్ కుమార్ మాదిగ స్పందించారు. ఆయన కాచిగూడ స్టేషన్ సమీపంలో గల అమ్మవారి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైల్వే శాఖ డబ్బులకు ఆశపడి పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయడం కొరకు అక్కడ ఉన్న గుడిని కూల్చివేసే ప్రయత్నం చేశారని దానిని గమనించిన స్థానికులు అడ్డుకొని రక్షణ కల్పించారని టిలిపారు. అక్కడ గత కొన్ని సంవత్సరాలుగా చిన్న అమ్మవారి గుడి ఉందని కూడా చూడకుండా చుట్టూ ఉన్న ప్రహరీ గోడను కూల్చివేసారని తెలిపారు.దీంతో అక్కడ గంజాయి సేవించే వారు ప్రయాణికులు గుడి ఆవరణలో మలమూత్రాలు విసర్జించడం చాలా బాధ కలిగించిందని సంపత్ కుమార్ మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా రైల్వే శాఖ అధికారులు అమ్మవారి గుడికి చుట్టూ ప్రహరీ గోడను నిర్మించి రక్షణ కల్పించి హిందువుల మనోభావాలను గౌరవించాలని కోరారు. ఈ ఈ కార్యక్రమంలో శేఖర్, తిరుపతి, వినయ్ తదితరులు పాల్గొన్నారు



# హైదరాబాద్కు చేరుకున్న భారత్, వెస్టిండీస్ క్రికెట్ జట్లు

హైదరాబాద్ అక్టోబర్ 14న ఉప్పల్ స్టేడియంలో నాలుగో టీ20 మ్యాచ్ లో పాల్గొనేందుకు భారత్, వెస్ట్ ఇండీస్ క్రికెట్ జట్లు హైదరాబాద్ కు చేరుకున్నాయి. తరువాత ఆటగాళ్లు ప్రత్యేక బస్సుల్లో స్టార్ హోటల్కు వెళ్లారు. ఈ నేపథ్యంలో విమానాశ్రయం నుంచి హోటల్ వరకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

# దేశంలో సంక్షోభాన్ని సృష్టించేందుకు కుట్ర పన్నుతున్న రాహుల్ గాంధీ

## మాజీ ఎంపీ, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్



హైద్రాబాద్ అక్టోబర్ 13:దేశంలో సంక్షోభాన్ని సృష్టించేందుకు రాహుల్ గాంధీ కుట్ర పన్నుతున్నారని మాజీ ఎంపీ, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు.మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ

రాహుల్ గాంధీ ఇప్పుడు 'రౌడీ గాంధీ'గా మారిపోయారు.

న్యాయవ్యవస్థపై కాంగ్రెస్ దాడిని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

13 కోట్ల ఓట్ల చోరీ ఆరోపణలు కేవలం కాంగ్రెస్ ఆడుతున్న మైండ్ గేమ్‌లో భాగమే.

దమ్ముంటే సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌తో సహా ఏ బూత్‌కైనా రండి.. పరిశీలిద్దాం.

ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేకనే ఈసీ, న్యాయవ్యవస్థ వంటి స్వతంత్ర సంస్థలపై నిరాధార నిందలు వేస్తున్నరు.

ర్యాలీల పేరిట మహిళా జర్నలిస్టులు, పోలీసులపై రాహుల్ గాంధీ దాడులకు దిగడం అత్యంత హేయమైన చర్య అని దుయ్యబట్టారు.

దేశంలో కృత్రిమంగా సంక్షోభ పరిస్థితిని సృష్టించి, విదేశీ శక్తుల అండతో ప్రజాస్వామ్య వ్యవస్థలను అస్థిరపరిచేందుకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కుట్రలు పన్నుతున్నారు. పార్లమెంట్‌లో మాట్లాడాల్సిన ప్రతిపక్ష నాయకుడు, రోడ్లమీదికి వచ్చి ఒక వీధి రౌడీలా ప్రవర్తిస్తూ 'రౌడీ గాంధీ'గా మారిపోయారు.

మొన్న జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ చేపట్టిన ధర్నా ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ మీదో లేక బీజేపీ మీదో చేసిన పోరాటం కాదు.. రాహుల్ గాంధీకి పట్టుకున్న తీవ్రమైన అభద్రతా భావం, క్రెడిబిలిటీ లేమికి నిదర్శనమన్నారు.

నిరసనల పేరిట రాహుల్ గాంధీ చేస్తున్న విన్యాసాలను మీడియా విజువల్స్‌లో దేశమంతా చూసింది. ఐకిడో మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్ పేరుతో 'మౌంటెడ్ ఎల్బో చోక్' అనే ప్రమాదకర టెక్నిక్‌ను సొంత కార్యకర్తపైనే ప్రయోగించే ప్రయత్నం చేశారు. ఒక వైద్యుడిగా చెబుతున్నాను.. మెడ, శ్వాసనాళం పై ఒక్క నిమిషం పాటు ఆ ఒత్తిడి పడితే స్పాట్‌లోనే మనిషి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది.

అదృష్టవశాత్తూ పోలీస్ అధికారి రాహుల్‌ను పక్కకు లాగడంతో ప్రాణాపాయం తప్పింది. సొంత కార్యకర్త ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టి, ఆ నెపాన్ని పోలీసులు, కేంద్ర ప్రభుత్వంపై నెట్టాలనే దారుణ ఆలోచన కాంగ్రెస్ నాయకత్వానిది.

రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు విచక్షణ కోల్పోయి వీధి రౌడీల కంటే ఘోరంగా వ్యవహరిస్తున్నారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులను నెట్టేయడం, దురుసుగా ప్రవర్తించడం దేశ చరిత్రలోనే మునుపెన్నడూ చూడలేదన్నారు..

అంతేకాకుండా, 'చలో సుప్రీంకోర్టు' పేరిట ర్యాలీ చేస్తూ, విధి నిర్వహణలో ఉన్న రిచా పరాశర్ అనే మూడు నెలల గర్భిణి అయిన మహిళా జర్నలిస్టును బలవంతంగా తోసేశారు. కడుపులోని బిడ్డ ప్రాణాలకు ముప్పు తెచ్చేలా ప్రవర్తించిన ఈ చర్య అత్యంత అమానుషం. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.

చరిత్రలో ఏ రాజకీయ పార్టీ కూడా న్యాయవ్యవస్థపై ఈ స్థాయిలో బహిరంగంగా విషం చిమ్మలేదు. 'చలో సుప్రీంకోర్టు' పేరుతో సర్వోన్నత న్యాయస్థానంపై దాడి చేయాలని చూడడం అత్యంత ప్రమాదకర పరిణామం.

సైనిక పాలన ఉండే పాకిస్తాన్‌లో సైతం న్యాయవ్యవస్థ అంటే భయభక్తులు ఉంటాయి. కానీ, ఇక్కడ కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, నేతలు బాధ్యతారాహిత్యంగా న్యాయస్థానాలను బెదిరిస్తున్నారు.

ఎన్నికల కమిషనర్ రాజీనామా అడిగారు, రేపు సీజేఐని అడుగుతారు, ఆ తర్వాత ఆర్మీ చీఫ్‌ను కూడా రాజీనామా చేయమంటారేమో.

బంగ్లాదేశ్, శ్రీలంక, అరబ్ స్ప్రింగ్ తరహాలో దేశంలో అరాచకం సృష్టించి ప్రభుత్వాన్ని అస్థిరపరచాలన్న విదేశీ కుట్రల భాగస్వామిగా కాంగ్రెస్ మారింది.

అజిత్ దోవల్ వంటి అధికారులపై కూడా వీరు విమర్శలు చేస్తున్నారు. ఈ అరాచక వైఖరిపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి, రాహుల్ గాంధీపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

ర్యాలీలో కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను ఎంత అవమానకరంగా పక్కకు నెట్టేశారో చూశాం. తమ కుటుంబానికి కాపలా కాసే సీనియర్ నేతలను కించపరచడం గాంధీ నెహ్రూ కుటుంబానికి తొలినుంచీ ఉన్న అలవాటే.

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న మన తెలంగాణ బిడ్డ టంగుటూరి అంజయ్య గారిని బేగంపేట ఎయిర్‌పోర్టులో రాజీవ్ గాంధీ ఎలా అవమానించారో తెలుగు ప్రజలు ఇంకా మర్చిపోలేదు. ఆ ఆత్మగౌరవ పోరాటమే నాడు ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావానికి, కాంగ్రెస్ పతనానికి దారితీసిందన్నారు.

కర్ణాటకలోనూ వీరేంద్ర పాటిల్‌ను అలాగే అవమానించారు. ఆత్మాభిమానం, కనీస విచక్షణ ఉన్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాలి.

13 కోట్ల ఓట్ల చోరీ జరిగిందంటూ రాహుల్ గాంధీ టీమ్ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోంది. ఈవీఎంల మీద, ఓట్ల మీద మాట్లాడటం తప్ప మోదీ గారి పాలనపై, అవినీతి రహిత అభివృద్ధిపై మాట్లాడే సత్తా కాంగ్రెస్‌కు లేదు.

13 కోట్లలో దాదాపు 3 కోట్ల మంది ట్రేస్ చేయలేని అబ్సెంట్ ఓటర్లు (వీరిలో బంగ్లాదేశీలు, అక్రమ చొరబాటుదారులు సైతం ఉంటారు).

6.30 కోట్ల మంది ఓటర్లు ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి షిఫ్ట్ అయినవారు.

2.80 కోట్ల మంది చనిపోయినవారు కాగా, కోటి మందికి పైగా డూప్లికేట్ ఓటర్లు ఉన్నారు,

ఎన్నికల సంఘం సాధారణ ప్రక్షాళనలో భాగంగానే ఈ డూప్లికేట్ ఓట్లను తొలగించింది. హైదరాబాద్ పరిధిలోనే దాదాపు 40 లక్షల ఓట్లు తగ్గాయి. ఎల్బీనగర్‌లో ఉండే 40--50 వేల మందికి మునుగోడులోనూ ఓట్లు ఉన్న పరిస్థితిని చూశాం. ఉప్పల్, బోధన్, ఆలేరు, జనగాంలలోనూ డబుల్ ఓట్లు బయటపడ్డాయని

ఈ అంశంపై బీజేపీ బహిరంగ సవాల్ విసురుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌తో సహా రాష్ట్రంలో ఏ పోలింగ్ బూత్‌కైనా రండి, మీడియా సమక్షంలో కూర్చుని నిగ్గుతేలుద్దాం. కాంగ్రెస్ ఆరోపణలు తప్పని తేలితే రాజీనామా చేస్తారా? రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వచ్చే దమ్ముందా? అని సవాల్ విసిరారు.

రాహుల్ గాంధీని తప్పించి ఏఐసీసీ పీఠం దక్కించుకోవాలనే ఆలోచనతోనే రేవంత్ రెడ్డి రోజూ మాటలు మారుస్తున్నారు. నిన్నటివరకు 'ఆర్య వర్సెస్ ద్రావిడ', 'శివ వర్సెస్ రామ్' అన్న రేవంత్ రెడ్డి.. నిన్న గోవా వెళ్లి కాంగ్రెస్ అంటే రాముడు, బీజేపీ అంటే రావణుడు అంటున్నారు. అసలు వీరికి రాముడితో పోల్చుకునే నైతిక హక్కు ఎక్కడుంది?అని ప్రశ్నించారు.దేశాన్ని సురక్షితంగా, సమర్థంగా నడిపిస్తున్న నరేంద్ర మోదీ గారు శ్రీరాముడి వంటి నాయకుడు. అమిత్ షా గారు లక్ష్మణుడిలా వెన్నంటే ఉన్నారు. కానీ, రాహుల్ గాంధీ ఆలోచనలు, కాంగ్రెస్ కుతంత్రాలు రావణాసురుడి మనస్తత్వాన్ని తలపిస్తున్నాయన్నారుప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా తిరస్కరించిన విషయాన్ని అంగీకరించకుండా, అరాచకం ద్వారా వ్యవస్థలను కూల్చాలని చూస్తే ప్రజలే కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారు. రాహుల్ గాంధీ తన హింసాత్మక, అరాచక వైఖరిని మార్చుకోకపోతే దేశ ప్రజలు, తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ అరాచకాలను ఎండగట్టడం ఖాయమన్నారు.

# ఖమ్మం జిల్లా అభివృద్ధిలో

## మంత్రి తుమ్మల ముద్ర..

**ఖమ్మం, సత్తుపల్లిలో ఆర్అండ్‌బీ అతిథి గృహాల నిర్మాణానికి టెండర్లు ఆహ్వానం..**

**ఖమ్మంలో రూ.7.70 కోట్లతో 6 సూట్లు..**

**సత్తుపల్లిలో రూ.3.50 కోట్లతో 4 సూట్లు..**

**కల్లూరులోనూ అతిథి గృహ నిర్మాణానికి ప్రతిపాదనలు..**

**మెరుగైన ప్రభుత్వ వసతి సౌకర్యాల కల్పనే లక్ష్యం..**



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 13:**అభివృద్ధి పట్ల దూరదృష్టి.. ప్రజా అవసరాలపై ప్రత్యేక దృష్టి.. హామీలను ఆచరణలోకి తీసుకురావడంలో కార్యదక్షత.. ప్రాంత ప్రగతికి నిధులు సమకూర్చడంలో రాజకీయ చొరవ.. ఇవే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ ప్రస్థానంలో ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి! పదవులు మారినా.. శాఖలు మారినా.. ఖమ్మం జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ఆయన అడుగులు సాగుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగానికి అవసరమైన మౌలిక వసతుల కల్పన నుంచి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం వరకు ప్రతి అంశాన్నీ అభివృద్ధి దృక్పథంతో పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా ఖమ్మం, సత్తుపల్లిలో ఆర్అండ్‌బీ అతిథి గృహాల నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించగా, వాటి ప్రక్రియ కొనసాగుతోంది. మరోవైపు కల్లూరులోనూ ఆధునిక వసతులతో నూతన అతిథి గృహం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఒకప్పుడు ప్రతిపాదనలకే పరిమితమైన పనులను ముందుకు తీసుకెళ్లడం.. మారుతున్న అవసరాలకు అనుగుణంగా కొత్త సదుపాయాలను కల్పించడం.. జిల్లా అభివృద్ధిలో తనదైన ముద్ర వేయడం ద్వారా తుమ్మల తన రాజకీయ అనుభవాన్ని ఆచరణలో చూపిస్తున్నారు. ఖమ్మం నుంచి సత్తుపల్లి వరకు.. అక్కడి నుంచి కల్లూరు దాకా సాగుతున్న ఈ ప్రయత్నాలు జిల్లా మౌలిక వసతుల బలోపేతానికి మరో ముందడుగుగా నిలుస్తున్నాయి.

అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించడం, వాటిని కార్యరూపంలోకి తీసుకురావడంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ వసతి సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఆర్అండ్‌బీ అతిథి గృహాల నిర్మాణంపై దృష్టి సారించారు. ఖమ్మం, సత్తుపల్లిలో నూతన అతిథి గృహాల నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించగా, ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. మరోవైపు కల్లూరులోనూ ఆధునిక హంగులతో ఆర్అండ్‌బీ అతిథి గృహం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో మూడు ప్రాంతాల్లో ప్రభుత్వ వసతి సదుపాయాల విస్తరణకు మార్గం సుగమమవుతోంది.

జిల్లా కేంద్రంతో పాటు సత్తుపల్లి, కల్లూరు ప్రాంతాలకు వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పర్యటనలకు వస్తుంటారు. వారికి మెరుగైన వసతి కల్పించడంతో పాటు అధికారిక సమావేశాలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు అనుకూలమైన సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ నిర్మాణాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా పాత భవనాల స్థానంలో ఆధునిక సౌకర్యాలతో కొత్త భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టారు.

ఖమ్మంలో రూ.7.70 కోట్లతో ఆరు సూట్లు...

ఖమ్మం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించినది. దశాబ్దాలుగా ఎందరో ప్రముఖులకు ఆతిథ్యమిచ్చిన ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. గోడలకు పగుళ్లు, పైకప్పుల నుంచి నీటి లీకేజీలు, కాంక్రీటు పెచ్చులు ఊడిపడటం, గదుల్లో తేమ చేరడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. తలుపులు, కిటికీలు దెబ్బతినడంతో పాటు తరచూ మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ నేపథ్యంలో పాత భవనాన్ని తొలగించి, అదే స్థలంలో ఆరు సూట్లతో నూతన అతిథి గృహాన్ని నిర్మించాలని నిర్ణయించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో అధికారులు రూ.7.70 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. 2026 జనవరి 2న రూపొందించిన అంచనాలను ఖమ్మం ఆర్అండ్‌బీ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎం. యాకోబ్ భవనాల విభాగం చీఫ్ ఇంజినీర్‌కు సమర్పించారు. అనంతరం జనవరి 13న చీఫ్ ఇంజినీర్ జి. రాజేశ్వర్‌రెడ్డి పరిపాలన అనుమతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం ఈ నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. అయితే పెరిగిన నిర్మాణ వ్యయాలు, ఆధునిక సౌకర్యాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు వ్యయాన్ని రూ.10 కోట్లకు పెంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రక్రియలు పూర్తయిన అనంతరం నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

సత్తుపల్లిలో రూ.3.50 కోట్లతో నాలుగు సూట్లు...

సత్తుపల్లిలో నాలుగు సూట్లతో ఆధునిక ఆర్అండ్‌బీ అతిథి గృహాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు 2016లోనే ప్రారంభమయ్యాయి. తొలుత రూ.1.50 కోట్లతో నిర్మాణానికి అనుమతులు లభించగా, అనంతరం సవరించిన అంచనాల ప్రకారం రూ.3 కోట్లకు అనుమతులు మంజూరయ్యాయి. కాలక్రమంలో నిర్మాణ వ్యయాలు పెరగడంతో ప్రస్తుత అంచనాల ప్రకారం రూ.3.50 కోట్లతో టెండర్లు ఆహ్వానించారు.

తాజాగా నిర్మాణ వ్యయాన్ని రూ.5 కోట్లకు పెంచి, సవరించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపడం జరిగింది. ఈ పెంపునకు సంబంధించి ప్రభుత్వ ఆమోదం ఇంకా రావాల్సి ఉంది. ఆమోదం లభించిన అనంతరం సవరించిన అంచనాలకు అనుగుణంగా తదుపరి చర్యలు చేపట్టనున్నారు. దశాబ్దకాలంగా వివిధ దశల్లో కొనసాగుతున్న ఈ ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

కల్లూరులోనూ ఆధునిక భవనానికి ప్రతిపాదనలు...

ఖమ్మం, సత్తుపల్లితో పాటు కల్లూరులోనూ ప్రభుత్వ వసతి సదుపాయాలను మెరుగుపరచాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్ణయించారు. కల్లూరులో ఆర్అండ్‌బీ అతిథి గృహ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు ఆధునిక హంగులతో భవన నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయి, అవసరమైన అనుమతులు లభిస్తే కల్లూరులోనూ మరో ఆధునిక ప్రభుత్వ వసతి భవనం అందుబాటులోకి రానుంది.

పదవి ఏదైనా.. అభివృద్ధే లక్ష్యం!..

రోడ్లు, భవనాలు సహా మౌలిక సదుపాయాల కల్పనలో ప్రాంతీయ అవసరాలకు ప్రాధాన్యమిస్తూ మంత్రి తుమ్మల ముందుకు సాగుతున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభమైన సత్తుపల్లి తనిఖీ బంగళా ప్రతిపాదనకు ఇప్పుడు కార్యరూపం లభించే దిశగా అడుగులు పడుతుండటం, ఖమ్మం నగరంలోని పాత అతిథి గృహం స్థానంలో కొత్త భవన నిర్మాణానికి చర్యలు చేపట్టడం, కల్లూరులోనూ కొత్త నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయించడం ఈ ప్రయత్నాల్లో భాగంగా కనిపిస్తున్నాయి.




ఈ మూడు ప్రాంతాల్లో ప్రణాళికలు పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చితే ప్రభుత్వ అధికారుల పర్యటనలు, ప్రజాప్రతినిధుల సందర్శనలు, అధికారిక సమావేశాలకు మెరుగైన వసతి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ మౌలిక సదుపాయాల బలోపేతానికి ఈ నిర్మాణాలు దోహదపడనున్నాయి.

## భవాని మందిరంలో భజన పోటీలు ప్రారంభం

**జహీరాబాద్, అక్టోబర్ 13 ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని భవాని మందిరంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భజన పోటీలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి భజన పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో






భాగంగా నిర్వహిస్తున్న ఈ భజన పోటీలు ఆరు రోజులపాటు కొనసాగనున్నాయి. ఈ పోటీల్లో మొత్తం 14 భజన బృందాలు పాల్గొంటున్నాయి. ఆయా బృందాలు భక్తి గీతాలు, సంప్రదాయ భజనలతో అమ్మవారిని కీర్తించనున్నాయి. భజన పోటీల ద్వారా భక్తిభావాన్ని పెంపొందించడంతోపాటు సంప్రదాయ కళలను ప్రోత్సహించేందుకు నిర్వాహకులు కృషి చేస్తున్నారు. పోటీలను తిలకించేందుకు భక్తులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన బృందాలకు న్యాయ నిర్ణేతలు ఇచ్చే తీర్పు ఆధారంగా విజేతలను ఎంపిక చేయనున్నారు.

108 ప్రదక్షిణలు చేసిన భక్తులు"

ఇదిలా ఉండగా, మంగళవారం ఉదయం నుంచే భవాని మందిరానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొందరు భక్తులు ఆలయంలో 108 ప్రదక్షిణలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి అనుగ్రహం తమ కుటుంబాలపై ఉండాలని, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తుల రాక పెరగడంతో ప్రాంగణమంతా సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో భజన పోటీల న్యాయ నిర్ణేతలు శంకర్ జోషి, చంద్రకాంత్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మహేందర్ గోడ్కె, శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, వైస్ చైర్మన్ శిరీష, సురేందర్ రెడ్డి, పట్టణ ప్రముఖులు మంకల్ శుభాష్, రాజగోపాల్, శివకుమార్ పాటిల్, వంశీ, జగదీష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పూజా సామగ్రితో సత్యనారాయణ వ్రతము, అలాయి - బలయి వేడుకలకు మౌకిక అంగీకారం

**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 13 అక్టోబర్ 2026**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నార్సింగి సర్కిల్ అంతర్ భాగమైన నెక్నాంపూర్ డివిజన్‌లోని అల్కాపూర్ రోడ్ 30లో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ పార్కులో మాత్రమే ప్రజా సౌకర్యర్థం ఉపన్యాస వేదికతో పాటు ప్రేక్షకులు కూర్చోవడానికి చదునుగా ఉన్న ఖాళీ స్థలం కలిగి ఉన్నది. పార్కు రెండవ మధ్య భాగాన్ని రక రకాల దట్టమైన గుబురు చెట్లతో విరాజిల్లుతు చుట్టుతా వాకింగ్ ట్రాక్ కలిగి ఉన్నది. మూడవది క్రీడా విభాగంగా బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్ కోర్టులు కలిగున్న ఆట స్థలంగా ప్రఖ్యాతి గాంచినది. ఈ మధ్య కాలంలో కృష్ణాష్టమి సందర్భంగా జయశంకర్ పార్కు గేటు ఎదురుగా ఉన్న ఉపన్యాస వేదికతో పాటు చదునుగా ఉన్న స్థలంలో ఇస్కాన్ టెంపుల్ వారు ఉట్టి పండుగ జరుపుకున్నారు. అదే వేదికగా వి.ఆర్.4 సహాయోగ్ చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజకీయాలకు అతీతంగా, ప్రజా సంక్షేమం దృష్ట్యా 24 అక్టోబర్ 2026 శనివారం రోజున ఉచిత పూజా సామగ్రి సమకూరుస్తూ ఉదయం సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతము తదనంతరం సాయంత్రం మహిళలు, పురుషులు, పిల్లలను ఆకర్షించే మిక్కీ మౌస్ ప్రదర్శన, బెలూన్ల జంతువుల



ఆకారాల కళ, ఇంద్రజాల మాయాజాల గారడి ప్రదర్శన, ధాండియాతో పాటు ఉచిత మొక్కజొన్న ప్యాలాలు, తిను భాండాగారంల సదుపాయంతో కూడిన అలాయి - బలయి కార్యక్రమంలకు 30 సెప్టెంబర్ 2026 న ధరఖాస్తు పత్రం సమర్పించడం జరిగింది. మంగళవారం రోజున ఇట్టి విషయమై జ్ఞాపిక లేఖను సంబందిత డిప్యూటీ కమిషనర్ ను కలసి అందజేయడశీ జరిగినదని మేనేజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్ రావు, ట్రస్ట్ కోశాధికారి హరీ హారనాథు రెడ్డి, సభ్యురాలు నూకల మంజుల తదితరులు తెలియజేశారు. అతని ఆదేశానుసారం పట్టణ కమ్యూనిటి శాఖ అధికారులను కలువగా ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు కార్యక్రమాన్ని కొనసాగించడానికి మౌకిక ఆదేశాలు ఇవ్వడం జరిగింది, అందుకు యావత్ ట్రస్ట్ సభ్యులు, స్థానిక ప్రజలంతా సంతోషం వ్యక్తపరచారు.

## టింబర్ డిపోలో పనిచేయని నిఘా కెమెరాలు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 13 ఏటూరునాగారం**ఏటూరు నాగారం మండల కేంద్రంలోని టింబర్ డిపోలో కోట్ల విలువ చేసే కల్ప నిల్వలు ఉన్న అక్రమంగా తరలిస్తున్న భారీ వాహనాలను సైతం ఈ టింబర్ డిపోలో నిలువ చేశారు అధికారుల నిర్లక్ష్యంతో ఆ ప్రాంతమంతా చీకటిమయమైపోయింది అడవికి దగ్గరలో ఉన్న టింబర్ డిపోలో సీసీ కెమెరాలు లేకపోవడంతో రాత్రి వేళలో లక్షల విలువ చేసే కలపను దొంగలించే ప్రమాదాలు కావస్తున్న అధికారులు దీనిపై పట్టింపు లేకపోవడంతో సీసీ కెమెరాలు పనికి రాకుండా పోయాయి ఇప్పటికైనా ఫారెస్ట్ డి ఎఫ్ ఓ టింబర్ డిపోలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి విలువైన కలపను రక్షించ వలసిందిగా కోరుతున్నాం



## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ఉత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించాలి..సత్యం శ్రీరంగం.

**కూకట్పల్లి (ప్రజాబలం ) అక్టోబర్ 13 :** తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో కోల్‌కతాలో 2026 అక్టోబర్ 31వ తేదీ నుండి నవంబర్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న సబ్ జూనియర్ త్రోబాల్ టోర్నమెంట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించేందుకు ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేయడానికి ఎంపిక పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ ఎంపిక పోటీల ద్వారా ప్రతిభ ఆధారంగా 15 మంది బాలురు, 15 మంది బాలికలను ఎంపిక చేయడం జరిగింది అని అన్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి, అడహక్ కమిటీ కన్వీనర్ డా. సత్యం శ్రీరంగం అధ్యక్షతన వారి కార్యాలయంలో ఎంపిక ప్రక్రియకు సంబంధించి ఈ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి అడహాక్ కమిటీ సభ్యులైన చిత్రా షెనాయ్, కృష్ణ రాజ్‌పుత్, భాస్కర్ రెడ్డి హాజరై సమావేశంలో చర్చించిన అనంతరం, క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.



## తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ను కలిసిన పట్లూర్ గ్రామ సర్పంచ్ పరుశురాం



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతిని ధి అక్టో బర్ 13 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం వికారాబాద్ ఎమ్మెల్యే తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ యూరోప్ స్టడీ ముగించుకొని స్వదేశానికి క్షేమంగా తిరిగివిచ్చేసి నా శుభ సందర్భంగాపట్లూర్ గ్రామ సర్పంచ్ పరశురాం, ఉప సర్పంచ్ అఖిల్,మాజీ ఎంపిటిసి రాజు, మహేష్, కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ చాట్ల రాకేష్ ప్రేమ పూర్వకంగా స్పీకర్ గారిని కలిసి ముచ్చటించి స్వీట్ న్యూస్ తో రావడం జరిగింది అని తెలిపారు

## ఇసుక లారీ డ్రైవర్లు ఊదుడే ఊదుడు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 13 మంగపేట** ములుగు జిల్లాలో ఊదుడే ఊదుడు కార్యక్రమాన్ని మొదలుపెట్టిన జిల్లా ఎస్పీ రామ్నాథ్ కేకన్. ములుగు జిల్లాలో ఎస్పీ ఆదేశాల మేరకు మద్యం మత్తులో ఇసుక లారీ డ్రైవర్లు ఏదైనా పొరపాటులు చేస్తారని ముందస్తుగా డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు స్థానిక ఎస్సైలు సంబంధించిన చెక్ పోస్టుల వద్ద పోలీసులచే ఇసుక లారీ డ్రైవర్లు మద్యం మత్తులో ప్రమాదాలు చేస్తారని వారిని కట్టడి చెయ్యాలనే ఆలోచనలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు దీని వలన చాలా ప్రమాదాలను తప్పించవచ్చానే ఆలోచనతో స్థానిక ఎస్పీ రామ్నాథ్ కేక తెలియజేశారు

ఎవరైనా డ్రైవర్లు మద్యం మత్తులో వాహనాలు నడిపితే వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేసి వారి యొక్క డ్రైవింగ్ లైసెన్స్ ను రద్దు చేస్తామని అన్నారు దీనితో వాహనదారులు మద్యం సేవించ కుండా రోడ్డుపై వాహనాలు నడిపే పరిస్థితి కనబడుతుంది దీనితో బాటసారులు వాహనదారులు సైతం మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని ఎస్పీ గారికి ములుగు జిల్లా ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు

### స్కూటీలు దొంగతనం చేస్తున్న ఐదుగురు నిందితుల అరెస్ట్

గుంటూరు నగర పరిధిలో వరుసగా ద్విచక్ర వాహనాలు దొంగిలించబడుతున్నాయని పోలీసులకు సమాచారం అందింది. దీనిపై నిఘా పెట్టిన లాలాపేట పోలీసులు ఐదుగురు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు.ప్రధాన నిందితుడు షేక్ కరీముల్లా. అతనితో పాటు షేక్ మాదర్ వలీ, షేక్ జాఫర్ సాదిక్, షేక్ మస్తాన్ వలి, మరో మైనర్ నిందితుడిని పట్టుకున్నారు. వీరంతా నల్లచెరువు, సంపత్ నగర్ నివాసులు. బృందంగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు.నల్లపాడు, పాత గుంటూరు, పట్టాభిపురం, సత్తెనపల్లి పరిధుల్లో దొంగతనాలు చేశారు. వీరి దగ్గర నుంచి 21 సుజుకి స్కూటర్లను రికవరీ చేశారు. వీటి మార్కెట్ విలువ సుమారు ?20 లక్షలు.దొంగిలించిన వాహనాలను తురకపాలెంలోని మధ్యవర్తి ద్వారా కంటైనర్లలో చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు తరలిస్తున్నారని పోలీసులు తెలిపారు.

## భూ రీసర్వేను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి.



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 13:**తల్లాడ మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో భూ రీసర్వేను జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. మంగళవారం ఆ గ్రామంలో సర్వే జరుగుతున్న తీరును స్థానిక తహసిల్దార్ కరుణాకర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. భూ సర్వేను పారదర్శకంగా చేయాలని ఆదేశించారు. రైతుల భూమి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి సర్వే చేయాలని సూచించారు. మొదట విడతలో భాగంగా లక్ష్మీపురం, కుర్నవల్లి, తెలగారం, బసవాపురం గ్రామాల్లో భూ సర్వే కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కరుణాకర్ రెడ్డి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

# జాతీయ ఆరోగ్య మిషన్ పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే రెగ్యులరేషన్ చేయాలని భారీ ర్యాలీగా తరలిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 13 ములుగు** ములుగు జిల్లా కేంద్రంలో మంగళవారం జాతీయ ఆరోగ్య మిషన్ లో పనిచేస్తున్న 17వేల మంది ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన సమ్మెను డాక్టర్ నరహరి ఆధ్వర్యంలో నిర్వహించారు దీనిలో భాగంగా ఈరోజు జిల్లా కేంద్రంలో ర్యాలీతోపాటు సమ్మె నిర్వహించారు గత 20 సంవత్సరాల నుంచి జాతీయ మిషన్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఇప్పటివరకు తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం రెగ్యులరేషన్ చేయలేదని జీతాలు పెంచడం లేదని అన్నారు ముఖ్యంగా కరోనా సమయంలో కరోనా బాధితుల కోసం మా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మా సహాయ శక్తుల మా వృత్తిని వైద్యాన్ని నమ్ముకుని రోగులకు సేవ చేస్తే ఈరోజు మా సేవలను గుర్తించకుండా మాకు నాన కష్టాలకు గురి చేస్తున్నారు ప్రభుత్వాలు వెంటనే మా కష్టాలను గుర్తించి ప్రతి ఒక్క ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు జీతాలు పెంచాలని రెగ్యులర్ చేయాలని అన్ని రాష్ట్రాలలో జాతీయ ఆరోగ్య మిషన్ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులరేషన్ చేసింది కానీ తెలంగాణ ప్రభుత్వంలో




రెగ్యురేషన్ చేయకపోవడం జీతాలు పెంచకపోవడం చాలా ఇబ్బంది కలిగించే పరిస్థితులు కనబడుతున్నాయని ఈరోజు కుటుంబ పోషణ భారమైపోవడంతో చాలా ఇబ్బందులకు లోనవుతున్నామని వారు అన్నారు ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం ఎన్ హెచ్ఎం లో పనిచేస్తున్న ప్రతి క్యాడర్ వాళ్లకు రెగ్యులర్ ఉద్యోగ భద్రత కల్పించాలని అలాగే హెల్త్ కార్డులు ఇప్పించాలని వారు కోరారు లేని పక్షాన పెద్ద ఎత్తున హైదరాబాదులో ఉద్యమిస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పి ఎస్ సి వైద్యులు ఆయుష్ వైద్యులు జిజిహెచ్ వైద్యుల అన్ని క్యాడర్ల ఉద్యోగులు పాల్గొన్నారు

## విద్యుత్ లైన్ల మార్పునకు రూ.3 కోట్ల నిధులు మంజూరీ చేపించి తీసుకువచ్చిన మంత్రి సీతక్కకు ధన్యవాదములు తెలియజేసిన ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 13 ఏటూరునాగారం** సుదీర్ఘకాలంగా ములుగు జిల్లాలో నెలకొని ఉన్న విద్యుత్ సమస్యను పరిష్కరించిన మంత్రి సీతక్క
ములుగు జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని ఆలోచనలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి సీతక్క ములుగు జిల్లాలో విద్యుత్ సమస్యతో బాధపడుతున్న ములుగు జిల్లా రైతులు ప్రజల సమస్యలు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క గారికి సమస్యను తెలుపగా వెంటనే ఉప ముఖ్యమంత్రి మూడు కోట్ల రూపాయలు నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు

దీనితో మంత్రి సీతక్క బట్టి విక్రమార్కులకు ములుగు జిల్లా ప్రజల తరఫున నుంచి మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలియజేశారు

దీనితో ములుగు జిల్లా ప్రజలకు విద్యుత్ సమస్యను పరిష్కరించిన మంత్రి సీతక్క గారికి ములుగు జిల్లా ప్రజల తరఫున ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు మంత్రి సీతక్క గారికి కృతజ్ఞతలు తెలియజేశారు

## జంట నగరాల తాగునీటి అవసరాలను తీర్చే సింగూరు జలాశయంలో నీటి మట్టాలు వేగంగా పడిపోతున్నాయి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 13 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా**సింగూరు పూర్తి నిల్వ సామర్థ్యం 29.9, టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 3.9 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది.సింగూరు, నుంచి నగరానికి గతంలో అందే 90, ఎమ్‌జీడీల నీటి సరఫరా ప్రస్తుతం 50, ఎమ్‌జీడీలకుతగ్గిపోయిశీది, (దాదాపు 40 ఎమ్‌జీడీల నీటి కోత పడింది). సింగూరు నీటి సరఫరా తగ్గడంతో హైదరాబాద్‌లోని వెస్ట్ ప్రాంతంతో పాటు ఐటీ కారిడార్‌పై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది,రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలమట్టాలు బ , ా ీ ్ ా పడిపోయాయి. తాగునీటిప్రత్యామ్నాయాలపై, దృష్టిసారించిన జలమండలి, ఉస్మాన్ సాగర్, మరియు హిమాయత్ సాగర్, జలాశయాల నుంచి అదనంగా 10,నుంచి 15, ఎమ్‌జీడీల నీటిని తెచ్చేందుకు కసరత్తు చేస్తోంది గోదావరి జలాల నుంచి నగరానికి అదనంగా రోజుకు సుమారు 40,ఎమ్‌జీడీల నీటిని తీసుకువచ్చేలా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.....



# జనగణనను పకడ్బందీగా నిర్వహించాలి.

### సాంకేతిక శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

### జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 13 కలెక్టరేట్**జనగణన--2027 జనాభా గణనకు సంబంధించి గణన విభాగాల కార్యనిర్వాహక సిబ్బంది, సాంకేతిక సహాయకులకు అక్టోబర్ 13, 14 తేదీల్లో ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహిస్తున్న రెండో దశ శిక్షణ కార్యక్రమానికి మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సాంకేతిక శిక్షణను సద్వినియోగం చేసుకుని, వివరాల నమోదులో తప్పులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గతంలో కాగితాలపై నమోదు చేసిన జనగణన వివరాలను ఈసారి ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయనున్నట్లు వివరించారు. అందుకు సంబంధించిన సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా నేర్చుకోవాలని, సందేహాలను శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు.



జనగణనలో ప్రతి దశలో చేపట్టాల్సిన పనులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రజల నుంచి సేకరించిన వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో శిక్షకులు ఏ.ఆర్. యువేందర్ బాబు, సిహెచ్. ఎస్‌వీఎస్ నాయుడు, కలెక్టరేట్ పరిపాలన అధికారి అల్లం రాజ్ కుమార్, తహసీల్దార్ విజయభాస్కర్, ఎస్‌ఓ లాల్ నాయక్, కలెక్టరేట్ పర్యవేక్షకురాలు మంజుల, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**జహీరాబాద్, అక్టోబర్ 13 ప్రజాబలం ప్రతినిధి:** పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు జహీరాబాద్ టౌన్ ఎస్సై లవకుమార్ తెలిపారు. సోమవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో బస్టాండ్ ఎదురుగా ఉన్న సింధు టిఫిన్ సెంటర్ పక్కన ఓ వ్యక్తి మృతిచెంది పడి ఉన్నట్లు గుర్తించామన్నారు. మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని, అనారోగ్య కారణాలతో మృతిచెంది ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి ఒంటిపై తెలుపు రంగు ఫుల్‌హ్యాండ్ చొక్కా, లోపల బూడిద రంగు టీషర్టు, నీలం రంగు ప్యాంటు ఉన్నాయని తెలిపారు. కడుపుపై సిలువ ఆకారంలో పచ్చబొట్టు ఉందని వివరించారు. మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, గుర్తింపు కోసం భద్రపరిచినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు లేదా అతని కుటుంబ సభ్యులు జహీరాబాద్ టౌన్ పోలీసులను 8712656763 నంబరులో సంప్రదించాలని కోరారు.

## మున్నూరు కాపు సంఘం చరిత్రలో అరుదైన ఘట్టం.

### ఒకే కుటుంబం నుండి తండ్రీకొడుకులకు కీలక పదవులు!

### ఖమ్మం జిల్లా మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షులుగా పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు

### యూత్ ఉపాధ్యక్షుడిగా ఈశ్వర్ రవితేజ ప్రమాణ స్వీకారం

### మున్నూరు కాపుల సంక్షేమమే మా ధ్యేయం : పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 13:**ఖమ్మం నగరంలో సోమవారం జరిగిన మున్నూరు కాపు సంఘం మహాసభల్లో రాష్ట్ర నాయకత్వం ఖమ్మం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది.ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలానికి చెందిన సంఘం నాయకులు,సీనియర్ జర్నలిస్టు పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు ఖమ్మం జిల్లా మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కాగా,ఆయన కుమారుడు పసుపులేటి ఈశ్వర్ రవితేజ జిల్లా మున్నూరు కాపు యూత్ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు.ఈ మేరకు సంఘం రాష్ట్ర నాయకులు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,సంఘం నాయకులు సిపిఐ జిల్లా సెక్రెటరీ దండు సురేష్ వారికి నియమక పత్రాన్ని అందించారు.తండ్రీకొడుకులిద్దరూ ఒకేసారి జిల్లా స్థాయిలో కీలక పదవులు చేపట్టడం పట్ల మధిర నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మున్నూరు కాపు సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు మాట్లాడుతూ,సంఘం రాష్ట్ర, జిల్లా నాయకత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి క్షణం సంఘం అభ్యున్నతికి కృషి చేస్తామని పేర్కొన్నారు.కులమతాలకు అతీతంగా సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి,మున్నూరు కాపుల సర్వతోముఖాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.సంఘం ఏ బాధ్యత అప్పగించినా దానిని ఒక పదవిగా కాకుండా, సమాజానికి తిరిగి రుణం తీర్చుకునే అరుదైన అవకాశంగా భావిస్తామని ఆయన స్పష్టం చేశారు.నా కుమారుడు ఈశ్వర్ రవితేజను యూత్ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవడం చాలా గర్వకారణంగా ఉంది.నేటి యువత కేవలం వ్యక్తిగత అభివృద్ధిని మాత్రమే కాకుండా, సామాజిక స్పృహను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.నా కుమారుడితో పాటు యువత అంతా కలిసి సంఘం బలోపేతానికి, పేద విద్యార్థుల చదువులకు,ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తారనే పూర్తి విశ్వాసం నాకుంది అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన మున్నూరు కాపు సంఘం ప్రముఖులు, పెద్దలు తండ్రీకొడుకులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.





# డిసెంబర్ నెలాఖరులోగా రీ సర్వే పూర్తి చేయాలి

### రీ సర్వేకు 19 ప్రత్యేక బృందాలు
### ములుగు జిల్లాలో 21 గ్రామాల్లో రీ సర్వే పూర్తి
### మిగిలిన పనుల్లో వేగం పెంచాలి
### జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 13 ములుగు** మంగళవారం ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అధ్యక్షతన రీ సర్వే బృందాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రీ సర్వే విధివిధానాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులు, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, బృందాల మధ్య సమన్వయంపై సిబ్బందికి అవగాహన కల్పించారు.





ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత రీ సర్వే కోసం 70 గ్రామాలను ఎంపిక చేయగా, ఇప్పటివరకు 21 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మిగిలిన 49 గ్రామాల్లో పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ ఆదేశాల మేరకు ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, వెంకటాపురం, వాజేడు, మంగపేట, కన్నాయిగూడెం మండలాలకు రెండేసి బృందాలు, మల్లంపల్లి మండలానికి ఒక బృందాన్ని నియమించినట్లు పేర్కొన్నారు. ప్రతి మండలంలో ఒకేసారి రెండు గ్రామాల్లో రీ సర్వే పనులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంపిక చేసిన గ్రామాలన్నింటిలో సర్వే పూర్తయ్యే వరకు బృందాలు నిరంతరంగా పనిచేయాలని ఆదేశించారు.

రీ సర్వే బృందాల్లోని రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, కార్యాలయ సహాయకులు, గ్రామ పాలన అధికారులు సమన్వయంతో తమ బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. సంబంధిత తహసీల్దార్లు, మండల సర్వేయర్లు బృందాలకు అవసరమైన రెవెన్యూ రికార్డులు, సర్వే రికార్డులు, పటాలు, ఇతర సంబంధిత పత్రాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయి నమోదు పుస్తకాల తయారీ, రికార్డుల నమోదు, పత్రాల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. గ్రామాల వారీగా రీ సర్వే పురోగతిని పర్యవేక్షిస్తూ, మిగిలిన పనుల్లో వేగం పెంచి డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి అల్లం రాజ్‌కుమార్, పర్యవేక్షకుడు మహేశ్, డివిజనల్ సర్వే పరిశీలకుడు సతీష్ చంద్ర, ములుగు తహసీల్దార్ విజయభాస్కర్, నాయబ్ తహసీల్దార్లు మల్లేశ్, నితీశ్, అన్ని మండలాల తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, రెవెన్యూ పరిశీలకులు, సీనియర్ సహాయకులు, కనిష్ఠ సహాయకులు, గ్రామ పాలన అధికారులు, సర్వేయర్లు, అనుమతి పొందిన సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ మిస్సింగ్ కేసులను అత్యంత ప్రాధాన్యతతో విచారించాలి..

### సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా సురక్షిత సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలి..
### జిల్లా వ్యాప్తంగా విజబుల్ పోలిసింగ్.. నిరంతరం వాహనాల తనిఖీలతో నేరాలు కట్టడి..
### నేర సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 13:**మైనర్ బాలబాలికలు కనిపించకుండా పోయిన కేసులను పోలీసులు అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని, ప్రతి కేసులో తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అధికారులను ఆదేశించారు.

మంగళవారం పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్లో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ..మైనర్ మిస్సింగ్ ఫిర్యాదు అందిన వెంటనే కేసు తీవ్రతను గుర్తించి, ఆలస్యం చేయకుండా చట్టప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాలని సూచించారు. మిస్సింగ్ అయిన బాలబాలికల ఆచూకీ గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు, మొబైల్ ఫోన్ సమాచారం, ఇతర అందుబాటులో ఉన్న ఆధారాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు.





బాలబాలికలు ప్రమాదంలో ఉన్నారనే అనుమానం ఉన్నప్పుడు తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని, మానవ అక్రమ రవాణా, కిడ్నాప్ వంటి కోణాల్లోనూ కేసు పరిస్థితులకు అనుగుణంగా దర్యాప్తు చేయాలని ఆదేశించారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ మైనర్ల ఆచూకీని త్వరితగతిన గుర్తించేందుకు కృషి చేయాలన్నారు.

ప్రతి మైనర్ మిస్సింగ్ కేసు పురోగతిని ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, దర్యాప్తులో నిర్లక్ష్యం వహించే అధికారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరిస్తూ సురక్షిత సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ప్రధాన రహదారులు, వ్యాపార సముదాయాలు, దుకాణాలు, రద్దీ ప్రాంతాల్లో ప్రజలు, వ్యాపారుల భాగస్వామ్యం తో సీసీ కెమెరాల ఏర్పాటుతో ప్రజా భద్రతను మరింత బలోపేతం చేసుకోవాలని అన్నారు. ముఖ్యంగా రహదారులు, ప్రవేశ ద్వారాలు, బయటకు వెళ్లే మార్గాలు స్పష్టంగా కనిపించేలా కెమెరాలను అమర్చుకోవాలని తెలిపారు.

ప్రజలు తమ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ఏర్పాటు చేసిన కెమెరాలు నిరంతరం పనిచేసేలా నిర్వహణ చేపట్టాలని సూచించారు.

ప్రజల భద్రత, నేరాల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు నిరంతరం కొనసాగాలని, ప్రధాన రహదారులు, కూడళు ్ల, ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రత్యేక వాహనాల తనిఖీలు చేపడుతూ ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాల పత్రాలను పరిశీలించాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచుతూ అక్రమ రవాణా, నిషేధిత మాదకద్రవ్యాల సరఫరా, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ తదితర అవసరమైన పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు.

ప్రజల భద్రత, నేరాల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు నిరంతరం కొనసాగాలని, ప్రధాన రహదారులు, కూడళు ్ల, ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రత్యేక వాహనాల తనిఖీలు చేపడుతూ ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాల పత్రాలను పరిశీలించాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచుతూ అక్రమ రవాణా, నిషేధిత మాదకద్రవ్యాల సరఫరా, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ తదితర అవసరమైన పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు.

మహిళల భద్రత, స్వీయరక్షణపై ఉమేన్ సేఫ్టీ విభాగం, షీటీమ్ బృందాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ.. మహిళలు, బాలికలు ఎలాంటి భయం లేకుండా విద్య, ఉద్యోగ, ఇతర రంగాల్లో ముందుకు సాగేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు.

సమావేశంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతి రెడ్డి, సారంగపాణి, శ్రీనివాసులు, మహేష్, సర్వర్, స ్ త ్ య న ా ం ా య ్ ం ణ , నర్సింహారావు,సాంబరాజు,సుశీల్ సింగ్, ఏవో కళావతి పాల్గొన్నారు.

# 20వ వార్డులో వీధి కుక్కల బెడదకు పరిష్కారం.

### మున్సిపల్ చైర్ పర్సన్ కాపా చంద్రకళ, కౌన్సిలర్ వరలక్ష్మి శ్యాంబాబుకు వార్డు సభ్యుల కృతజ్ఞతలు.

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 13:**వైరా మున్సిపాలిటీ 20వ వార్డులో వీధి కుక్కల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు






ఎదుర్కొంటున్నారు, రాత్రి వేళల్లో కుక్కలు అరుస్తూ ప్రజలకు నిద్రలేకుండా చేయడంతో పాటు,రోడ్లపై వెళ్లే వాహనాల వెంట పడుతూ ప్రమాదకరంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు,ఈ సమస్యను 20వ వార్డు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లడంతో అని

ఆ మే స్పందించి మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ సహకారంతో సంబంధిత సిబ్బంది మున్సిపల్ కమిషనర్ సహకారంతో వీధి కుక్కలను డాగ్ కేర్ సెంటర్‌కు తరలించడం జరిగింది,ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వార్డు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి శ్యాంబాబు కృషి చేస్తున్నారని వార్డు ప్రజలు అభినం దించారు.

# రోడ్ల పేరిట రైతుల వద్ద నుంచి వేల ఎకరాలు లాక్కుంటున్నారు

## సబితా ఇంద్రారెడ్డి



హైదరాబాద్ మహేశ్వరం నియోజకవర్గంలో దాదాపు 2,000 ఎకరాల భూములు ప్రభుత్వం లాక్కుంది. అసలు ఎందుకు భూములు తీసుకుంటున్నారు..? ఈ భూదాహం ఏంటని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం తెలంగాణ భవన్ లో ఆమె మీడియాతో మాట్లాడారు.

దేని కోసం తీసుకుంటున్నారో చెప్పకుండా రైతులను ఎందుకు రోడ్డున పడేస్తున్నారు రేవంత్ రెడ్డి?

రోడ్ల పేరిట రైతుల వద్ద నుంచి వేల ఎకరాలు లాక్కుంటున్నారు. కొత్వాల్గూడ నుంచి కొడంగల్కు.. అలాగే మహేశ్వరం నియోజకవర్గంలో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు వేస్తున్నారు. ఆల్రెడీ రోడ్డు మార్గాలు ఉండగా.. మళ్లీ భూములు లాక్కొని కొత్తగా రోడ్లు వేయాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు.

అవసరం లేకున్నా.. తమ వ్యక్తిగత స్వార్థం కోసం రోడ్లు వేస్తున్నారే తప్ప.. ప్రజలకు ఉపయోగం లేదని అన్నారు.బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ ఖరారు కాలేదు.. భూసేకరణ చేయమని రాష్ట్ర ప్రభుత్వానికి మేం చెప్పలేదని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఒకవేళ వాళ్లు బుల్లెట్ ట్రైన్ పేరిట భూసేకరణ చేస్తుంటే.. అది ఇల్లీగల్ అని కేంద్రమంత్రి స్పష్టం చేశారని గుర్తు చేసారు. మరి.. బహదూర్గూడ రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కొని, రాత్రికి రాత్రి ఫెన్సింగ్ వేసిన రేవంత్ ప్రభుత్వం దీనికి ఏం సమాధానం చెప్తుంది? అసలు బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ ఖరారు కానప్పుడు.. ఏ ఉద్దేశంతో బహదూర్గూడ భూములు తీసుకున్నారు?

బుల్లెట్ ట్రైన్ ఎక్కడ వస్తుందో కేంద్ర ప్రభుత్వానికే తెలియనప్పుడు.. రేవంత్ ప్రభుత్వం రాష్ట్ర రైతులను ఎందుకు భయపెట్టిస్తున్నారని అమె నిలదీసారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com